

రెడీ

కత్తులు దూస్తున్న పోలీసులు

- తొడకొడుతున్న పందెం కోడి
- కత్తుల సంచులతో పందెగాళ్లు రెడీ
- ప్రతి ఏడాది హెచ్చరికలతో సరి
- నిద్దరోతున్న అధికార యంత్రాంగం
- సంక్రాంతి మూడు రోజులూ చూస్కో
- వైసీపీ నేతలకు ఆదాయ మార్గం?
- ఈ సారైనా కోర్టు ఆదేశాలమలయ్యేనా?
- గ్రామాల్లో సిద్ధమైన బరులు

పోలీసులు కత్తి కాంతారావులే.. ముందు కత్తిదూయడం.. ఆ తరువాత చల్లబడిపోవడం వారికి అలవాటే.. ఆ నాలుగు రోజులు హడావుడి చేస్తారు.. ఆ తరువాత ఏడాదంతా ఎదురుచూస్తారు. మళ్లీ కోడి పందేల సీజన్ వచ్చినప్పుడు మామూలే.. మళ్లీ కత్తి దూస్తారు.. అయితే ఏడాది నుంచి ఆ కత్తుల తయారీపై మాత్రం దృష్టి పెట్టరు. అంతా తెలిసినా మిన్నకుండిపోతారు.. చివరిలో మాత్రం అడపాదడపా కేసులు నమోదు చేసి మేమున్నామంటారు.. ఆరంభం నుంచే కోడికత్తుల తయారీ అడ్డుకుంటే చివరిలో ఈ ఇబ్బంది ఉండదు కదా అనేది జనం వాదన..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కోడి పందెం అంటే తాట తీస్తాం.. కత్తి కడితే కటకటాలే.. ప్రతి ఏడాదీ సంక్రాంతి సందర్భంగా అధికారులు చాలా బలంగా జారీ చేసే హెచ్చరికలివి. కానీ, 'బరి'తెగించడం.. పందెం కోడి తొడగొట్టి మరీ కత్తికట్టించుకోవడం కళ్లముందు జరిగే ఓ రసవత్తరమైన సినిమా. ఈ సారి కూడా ఆ బొమ్మ పడుతుందని పరిస్థితులు చెబుతున్నాయి. ఈ సినిమాలో అందరూ అనుకున్నట్లు కోడి పుంజు కాదు హీరో.. దానికి కట్టే కత్తి పదునైన హీరో. ఈ హీరో ముందు రియల్ హీరోలు ప్రతి ఏడాదీ డీలా పడిపోతూనే ఉన్నారు. సంక్రాంతి వచ్చిందంటే గోదావరి జిల్లాల పేరుచెబితే ఠక్కున గుర్తొచ్చేవి కోడి పందేలు. దీంతో కోడి పందేలకు విదేశాల నుంచి కూడా పందెంగాళ్లు,ఆసక్తి ఉన్నవాళ్లు రెక్కలపై ఎగిరొచ్చి గోదారి జిల్లాల్లో వాలిపోతుంటారు.ఇది ప్రతి ఏడాదీ జరిగే తంతు. వాస్తవానికి సరదాలో భాగంగా పెద్ద పండుగకు కోడి పందేలను వేయడం పరిపాటి. అయితే క్రమంగా అది హింసతో కూడిన క్రీడ, వ్యసనంగా రూపాంతరం చెందింది. దీనికి ప్రధాన కారణం కోడి కత్తులనేది జగమెరిగిన వాస్తవం. ప్రతి ఏడాదీ వేలల్లో తయారవుతున్న కోడికత్తులపై దృష్టి సారించకుండా హెచ్చరికలు జారీ చేస్తూ కాలయాపన చేసి చివరికి పండుగ మూడు రోజులూ కళ్లుమూసుకోవడం యంత్రాంగానికి అలవాటుగా మారిన విషయం ఎవరూ కొట్టిపారేయలేని వాస్తవం.ఈ నేపథ్యంలో కోడీపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఒక్కో కత్తి రూ.700

సంక్రాంతి సీజన్‌కి కోడి పందేల కోసం వేల సంఖ్యలో కత్తులు తయారు చేస్తుంటారు. ఒక్కో కత్తి ధర రూ.300 నుంచి రూ.700 వరకూ ఉంటుంది. కత్తి కట్టే వాళ్ల వద్ద వందల్లో కత్తులు ఉంటాయి.వాటిని ఓ బెల్టులా ఉన్న మందపాటి వస్త్రానికి అమర్చి ఆ వస్త్రాన్ని చుట్టగా చుట్టి పందెం వద్దకు తీసుకొస్తారు.బరులు నిర్వహించేవాళ్లు రోజుకింత అని గంపగుత్తగా మాట్లాడుకుంటారు.మరికొందరు పందేన్ని బట్టి డబ్బులు తీసుకుంటారు. కత్తి కట్టే వాళ్లకు పందేనికి రూ.300 నుంచి రూ.1,000 వరకూ ముట్టచెబుతారు. కత్తి కట్టే వాళ్లకు తెలిసిన పందెంగాళ్లు అదనపు సొమ్ము కూడా చెల్లిస్తారు. కోళ్లు వందల్లో ఉంటే కత్తులు వేలల్లో ఎందుకనే అనుమానం రావొచ్చు. ఒకసారి పందేనికి వాడిన కత్తి ఆ రోజు మరో పుంజుకు కట్టరు. ఆ కత్తిని మళ్లీ సానబట్టించిన తర్వాతే వేరే పుంజుకు కడతారు. దీంతో పెద్ద బరుల్లో ఉండే కోడికత్తికట్టే వ్యక్తుల వద్ద ఒక్కో బెల్టులో కనీసం 20-30 కత్తులు ఉంటాయి. ఇలా వేలల్లో కత్తులు అందుబాటులో ఉంటున్నాయి.

కత్తులది ప్రధాన భూమిక..

కోడి పందేల్లో కత్తులది ప్రధాన భూమిక.అందుకే కోడి కత్తిని ప్రత్యేకంగా తయారు చేస్తారు.ముందు భాగంలో కత్తి.. దానికి అమర్చి కోడి కాలుకు కట్టడానికి వీలుగా ఊచ వంటి ఏర్పాటు ఉంటుంది.ఈ ఊచను 'కూలు' అంటారు. కత్తి, కూలు కలుపుకొని కోడి కత్తి 4 నుంచి 6 అంగుళాల పొడవు ఉంటుంది.కూలును తాడుతో కోడి కాలుకు బలంగా కడతారు.దీంతో కత్తి బెసకడం ఉండదు.ఆపరేషన్లు చేసే సర్జికల్ బ్లేడుతో సమానమైన పదునుతో ఉంటాయి. ఈ కత్తులను పండుగకు రెండు నెలల ముందు నుంచే రహస్యంగా తయారు చేస్తారు. కోడి కత్తి ఎట్టి పరిస్థితుల్లోనూ వంగి పోకుండా ఉంటుంది. కత్తి విరగాలే గానీ, వంగిపో కూడదని పందెంగాళ్లు చెబుతారు.దీనికోసం నాణ్యత కలిగిన ముడిసరుకు వాడతారు. ఉక్కుతో తయారైన కమాను కట్టలు, రైల్వేబెడ్లు వంటివి ఉపయోగిస్తారు.ఇప్పుడు కత్తి మరింత పదునుగా ఉండడానికి హెలీకాప్టర్ రెక్కలు తదితర విడిభాగాలను ఉపయోగిస్తున్నారని చెబుతున్నారు.పండుగ సీజన్‌లో కత్తి కట్టే వాళ్లకు చాలా డిమాండు ఉంటుంది.అడ్వాన్సులు చెల్లించి మరీ పందెం బరులు నిర్వహించేవాళ్లు కాపాడుకుంటారు.కత్తి,కత్తి కట్టే తీరుపైనే పందెం గెలవడం ఆధారపడి ఉంటుందని పందెంగాళ్లు నమ్ముతారు.కత్తి కట్టి నిర్వహించే కోడి పందేలపై నిషేధం ఉన్నా అది కాగితాలకే పరిమితమవుతోంది. ప్రాణాలు కోల్పోతున్న కోళ్లను చూస్తూ ఆవేదన చెందడం మాత్రమే జంతు ప్రేమికులకు మిగులుతోంది.



గోకవరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు

500 కత్తులు పట్టివేత

గోకవరం, జనవరి 11 : కోడి పందేలు నిర్వహణ కు కోడి కత్తులు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను గోకవరం పోలీసులు అరెస్టు చేసి 500ల కోడి కత్తులు స్వాధీనం ఎస్.ఐ యు.శివ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముందుగా అందిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సహాయంతో దాడులు చేశామన్నారు. మండలంలోని వీరంద్ర కాలనీ సమీపంలో కోడి కత్తులు తయారు చేస్తుండగా ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరొ ఇద్దరు పరారయ్యారు.వీరి నుంచి 233 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. వెలమపేటలో కోడి కత్తులు తయారు చేస్తుండగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 277 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ చెప్పారు. మండలంలో కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నిఘాపై కత్తి

ఈసారి కూడా పోలీసులు హెచ్చరికలతో సరిపెట్టినట్లు కనిపిస్తోంది.ఈ ఏడాది కచ్చితంగా కోర్టు ఆదేశాలను పాటిస్తామని.. కత్తి కడితే కఠిన చర్యలేనని ఉన్నతాధికారులు వల్లెవేసినా ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే గ్రామాల్లో చాటుమాటుగా పందేలు మొదలయ్యాయని సమాచారం. ఇక పెద్ద బరుల నిర్వాహకులు భోగి కోసం ఎదురు చూస్తున్నారు. బరులకు కావాల్సిన టెంట్లు, కర్రలు, అంగబలాన్ని సిద్ధం చేసుకొనే పనిలో బిజీ అయిపోయారు. జిల్లాలో కొన్ని కత్తుల తయారీ కేంద్రాల వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌ని ఇప్పటికే పైకంతో ప్రసన్నం చేసుకున్నారనే వాదన వినవస్తోంది. దీంతో ఉన్నతాధికారులు ఎంత కాలు దువ్వుతున్నా కంచే చేను మేయడంతో చేష్టలుడిగి చూడడం తప్ప చేసేదేమీ ఉండడం లేదు.ఇక్కడ ప్రత్యేకించి పోలీసు నిఘా ఏమైందనే వాదన బలంగా వినిపిస్తోంది.

నడిపేది వైసీపీ నాయకులే!

కోడి పందేల బరుల నిర్వహణలో వైసీపీ నాయకుల పేర్లే వినిపిస్తున్నాయి.మూడు రోజుల్లో కోట్లాది రూపాయలు జేబులో పడే అవకాశం ఉండడంతో ఈ జూద క్రీడను దగ్గరుండి ఆడిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో 'మీకు అందాల్సింది అందుతుంది.. మీరు అటువైపు రావొద్దు' అనే హెచ్చరికలు ఇప్పటికే వెళ్లాయని చెబుతున్నారు. ఇప్పటికే కోడి పందేల వద్ద అనుబంధ జూదాలైన గుండాట, పేకాట, మూడు ముక్కలాట, బోర్డులు, మాంసాహార, బిర్యానీ, కూల్‌డ్రింక్స్ తదితర స్టాల్స్ నిమిత్తం అడ్వాన్సులూ పుచ్చుకున్నారని గతేడాది వేమగిరి జంక్షను దగ్గర్లోని జాతీయ రహదారి పక్కనే పెద్ద పెద్ద టెంట్లు వేసి పెద్ద బరి నిర్వహించారు. జీపులో వచ్చి ప్రాంగణం చుట్టూ ఓ రౌండు వేసి వెళ్లే విధులను పోలీసులు నిర్వర్తించారు. ఈ బరి ఏర్పాటు చేసినవాళ్లు నగరానికి చెందిన ఓ వైసీపీ నేత అనుంగులు కావడం గమనార్హం. దీంతో ఇప్పుడూ అధికార బలం పోలీసుల కళ్లకు గంతలు కడుతుందనే వాదన వినిపిస్తోంది.



గతేడాది వేమగిరిలో బరి పక్కనే ఉన్న పోలీస్ జీప్

100 కత్తులు స్వాధీనం

పెరవలి, జనవరి 11 : సంక్రాంతికి కోడిపందాలు నిర్వహించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ సూర్యభగవాన్ హెచ్చరించారు. పెరవలి మండలం నడిపల్లి కోటకు చెందిన వీరమల్లు రామకృష్ణ వద్ద 40 కోడి కత్తులు, ఉండ్రాజవరం మండలం తాడిపర్రుకు చెందిన నందమూరి వెంకటేశ్వరరావు వద్ద 60 కోడి కత్తులు సీజ్ చేసి వారి ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ జగదీశ్, కొవ్వూరు డీఎస్పీ వర్మ ఆదేశాలు మేరకు నిడదవోలు సీఐ ఆధ్వర్యంలో గురువారం దాడులు చేసినట్లు తెలిపారు.



ఆఫర్ల వల

కొనుగోలుదారులకు డిస్కౌంట్లతో ఎర

- పండుగ వేళ ఆఫర్లే..ఆఫర్లు
- పాత స్టాకు, నాసిరకం క్లియర్
- ఆషాఢం, సంక్రాంతికి ధమాకా
- వినియోగదారుల జేబుకు చిల్లు
- వ్యాపారుల గల్లాపెట్టెలు గలగల
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- పట్టించుకోని యంత్రాంగం

ఫ్రీ..ఫ్రీ..ఫ్రీ.. మా షాపునకు రండి.. మీకు కావాల్సింది తీసుకెళ్లండి.. చివరిలో చిన్న చిన్న అక్షరాలతో ఉన్న షరతులు వర్తిస్తాయి..అనే మాట చూడకుండా ఆఫర్లకు ఎగబడిపోతున్నారు.. షాపునకు వెళ్లిన తరువాత మీరు ఎంత కొంటే అంత ఫ్రీ అంటున్నారు.. ఇంకేంటి బాగానే ఉంది కదా జేబు ఖాళీ చేసుకుని అవసరం ఉన్నా లేకపోయినా కొనుగోలు చేసుకుని ఇంటిబాట పడుతున్నారు. ఇలా వ్యాపారులు కొత్త కొత్తగా ఆలోచించి.. ఆఫర్ల వల వేసి వ్యాపారం పెంచుకుంటున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓ సినిమాలో చీరకు కారు ఫ్రీగా ఇస్తామన్నా కొనడానికి ఎవరూ ముందుకురారు.కానీ ఇవాళ కారుకు గుండుసూది ఉచితమంటే ఎగబడే పరిస్థితి.ఇదే అదనుగా పండుగ వచ్చిందంటే డిస్కౌంట్ల వల వేసి ఆఫర్ల మాయలో పడేసి గల్లా పెట్టెలు నింపుకుంటూ వినియోగదారుల జేబుకు పెద్ద చిల్లు పెడుతున్నారు.ఆషాఢం,సంక్రాంతి వచ్చిందంటే వ్యాపారులకు పెద్ద పండుగే. జనాల విజ్ఞతకు పెద్ద పరీక్షే. నష్టానికి ఎవరైనా ఎందుకు వ్యాపారం చేస్తారనే చిన్న లాజిక్ మిస్సవుతూ రాయితీలకు ఎగబడుతున్నారు.సామాన్యుడి ఆశను అలుసుగా చేసుకుంటున్న డిస్కౌంట్ల మాయాజాలంపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి తూర్పుగోదావరిలోనే కాకుండా విభజిత తూర్పు గోదావరిలో కూడా రాజమహేంద్ర వరం వాణిజ్యానికి పెట్టింది పేరు. అటు తూర్పు మన్యం, ఇటు కోనసీమ నుంచి కూడా వేడుకలు,పండుగలకు కొనుగోళ్లకు ఇక్కడికే జనాలు వస్తుంటారు. ముఖ్యంగా రోజూ కోట్లాది రూపాయల వస్త్ర వ్యాపారం జరుగుతుంటుంది.సంక్రాంతి సందర్భంగా డిస్కౌంట్లు, రిబేట్లు,ఆఫర్లు, బహుమతుల హడావుడి మొదలైంది. ఏకంగా 50%పైన రాయితీ ఇచ్చేస్తున్నారు. మార్చి నుంచి దాదాపు 7 నెలల పాటు ముహూర్తాలు లేకపోవడం,ఈ సారి ఎన్నికల సంక్రాంతి కావడంతో అటు వ్యాపారులు సాధ్యమైనంత ఎక్కువగా స్టాకును క్లియర్ చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

పాతస్టాకు.. నాసిరకం

ఏడాదిలో కొన్ని ప్రత్యేక రోజులు, పర్వదినాలు వ్యాపారులకు లాభసాటిగా మారాయనేది జగమెరిగిన వాస్తవం. ఆషాఢం వచ్చిందంటే క్లియరెన్స్ సేల్‌కి రెక్కలొస్తాయి. పెద్ద పండుగ, దీపావళికి ఆఫర్ల ధమాకా వినియోగదారులను ఆవహిస్తోంది. ఏ వ్యాపారీ నష్టానికి వ్యాపారం చేయడనేది జగమెరిగిన సత్యం. పెద్ద ఎత్తున కొని గోదాముల్లో మూలుగుతున్న స్టాకును ఆషాఢంలో క్లియర్ చేసే పనిలో భాగంగా ఆఫర్ల వల విసురుతారు.ఆషాఢం అమ్మకాల్లో మిగిలిన స్టాకునకు కొత్త స్టాకు కలిపి సంక్రాంతి అమ్మకాలకు ఎర వేస్తారు. ఒక చీరకు ఇంకో చీర ఫ్రీ,రెండు కొంటే ఒకటి ఉచితం, రూ.200లకేరెండు..ఇలా రాయితీల్లోప మార్గాన్నీ వదిలిపెట్టరు.

ఎంఆర్‌పీ అంటే ఏమిటి?

ప్రతి వస్తువు/సరుకుపై గరిష్ట చిల్లర ధర కచ్చితంగా ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. వాస్తవానికి గరిష్ట చిల్లర ధర(ఎంఆర్‌పీ)కే విని యోగదారులు కొనాలనే నిబంధనేమీ లేదు. ఎంఆర్‌పీపై బేరమాడొచ్చు. కానీ ఎంఆర్‌పీ అని అమ్మేస్తుంటారు.చాలా వస్తువులపై ఎంఆర్‌పీ ధర బాగా ఎక్కువగా వేస్తారు.ఉదాహరణకు ఏదోక కంపెనీ కుక్కర్ ఎంఆర్‌పీ రూ.3500 ఉంటే బేరమాడితే రూ.2500కే వస్తుంది. అప్పటికీ వ్యాపారికి లాభమే.అంటే ఎంఆర్‌పీ ఎంత ఎక్కువగా ముద్రిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.ఎంఆర్‌పీ ధరల ముద్రణపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేక ఎవరికి నచ్చిన ధరలు వారు అచ్చువేస్తూ వినియోగదారులను ఉచ్చులో పడేస్తున్నారు.వస్త్రాల విషయంలో ఒక్కో చీరకు, ఒక్కో చొక్కాకు.. ఇలా ధరలు నిర్ణయించి డిస్కౌంట్ పేరుతో దోచేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పట్టింపులేకుండా వ్యవహరిస్తుండడం వ్యాపారులకుకలిసొస్తుండగా..సామాన్యులు మోసపోతున్నారు.

ఇదీ అసలు మెలిక

తయారీదారుడి దగ్గర నుంచి నేరుగా కొనుగోలు చేస్తే ఓ ధర, రెండు మూడు చేతులు మారితే కొంత ఎక్కువ ధరకు గిట్టుబాటు అవుతుంది. ఒకేసారి పెద్ద మొత్తంలో తయారీ దారుల వద్ద నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేయడంతో తక్కువ ధరకు ఇచ్చే అవకాశం ఉంటుంది. కానీ లాభం మామూలే.ఉదాహరణకు ఓ చీరను తయారీదారుడి వద్ద నుంచి రూ.100కి కొనుగోలు చేస్తే దానిపై రూ.400 ధర వేశారను కుందాం.ఆ చీరపై 50% డిస్కౌంట్ ఇస్తే రూ.200కే మనకు వచ్చిందనుకుంటాం.కానీ ఆ డిస్కౌంటు ధరలోనే 100% లాభం దాగి ఉంటుంది. వినియోగదారులు షాపు లోపలికి వచ్చిన వెంటనే భారీ డిస్కౌంట్లంటూ మభ్యపెట్టే సరుకు కనబడుతుంది. ఒకవేళ వాటి ఆంతర్యం గ్రహించిన వాళ్లు అవి తీసుకోవడానికి ఇష్టపడకపోతే మిగతా వెరైటీ ల్లో ఎక్కువ ధర ఉన్న వాటినైనా కొనుగోలు చేసేస్తారు. కొనుగోలు చేయకుండా సుమారు 90% మంది తిరిగి వెళ్లరు. పైగా ఒకసారి కొన్న తర్వాత డబ్బులు వ్యాపారస్తుల గల్లాపెట్టెలోకి చేరిపోయినట్లే.నాణ్యతలేదని తిరిగి ఇచ్చేయాలనుకుంటే అక్కడే కొనుక్కోవాల్సిందే.డబ్బులు ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగివ్వరు. గృహోపకరణాల దగ్గర నుంచి గుండుసూదుల వరకూ అదే పద్ధతి అవలంబిస్తున్నారు.



కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం మెయిన్ మార్కెట్

లాటరీలతో ఎర

రాష్ట్రంలో లాటరీలు నిషేధం. దీనికి ఓ చట్టమే ఉంది. బహుమతుల పేరుతో జనాలను మోసం చేస్తున్నా అడిగే నాథుడు లేడు. కారు, ఫ్రిడ్జ్.. రానున్న రోజుల్లో రైలు, విమానాన్ని బహుమతులుగా పెట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు. వీటిని ప్రదర్శిస్తూ పలానా రోజున లాటరీ తీస్తాం. ఎవరి పంట పండితే వారికే అవి సొంతం అంటూ ఎర వేస్తున్నారు. ఉదాహరణకు ఓ ఫ్రిడ్జ్ ఖరీదు రూ.15 వేలు అనుకుందాం. 15 రోజుల తర్వాత లాటరీ ఉందనుకుందాం. ఆ 15 రోజుల్లో ఓ 2 వేల మంది సరుకును కొనుగోలు చేస్తే ఒక్కరికి మాత్రమే ఫ్రిడ్జ్ వస్తుంది.ఫ్రిడ్జ్ బాపతు ఒక్కో వస్తువుపై రూ.50 అదనంగా వడ్డించినా.. అక్షరాలా లక్ష రూపాయల రాబడి. దానిలో రూ.15 వేలు పోను రూ.85 వేలు గల్లాపెట్టెలోకే కదా!.

వినియోగదారుడా మేలుకో..

వినియోగదారులు మోసపోకుండా చట్టాలున్నా వాటిని ఉపయోగించుకోవడం పెద్ద ప్రశ్నగా మారింది. కొన్న తర్వాత మోసం బయటపడినా, నాణ్యత లేకున్నా చట్టాలను ఆశ్రయించే పరిస్థితి కానరావడం లేదు. ముఖ్యంగా పండుగ వేళల్లో వినియోగదారులు ఎక్కువగా మోసపోతున్నారు. కానీ ఎవరికి ఫిర్యాదు చేయాలో అధికశాతం మందికి తెలియదు. అంతెందుకు వినియోగదారులు ఫిర్యాదులు /సందేహాల నివృత్తికి ఉన్న టోల్‌ఫ్రీ నంబరు '1915' ఏ దుకాణాల్లోనూ కనిపించదు. వినియోగదారులకు న్యాయపరంగా సహాయం చేయడానికి మండల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు(ఇవి కోర్టుల ప్రాంగణాల్లో ఉంటాయి) సిద్ధంగా ఉన్నాయి.కానీ వాటినీఆశ్రయించరు.ఇవన్నీ వ్యాపారులు మోసం చేయడానికి ఊతమిస్తున్నాయి. అందువల్ల మొదటిగా వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా డిస్కౌంట్లు, రిబేట్లు, ఆఫర్లు అంటూ ఎవరూ నష్టాలకు వ్యాపారాలు చేయరనే సత్యాన్ని గుర్తుంచాలి. మోసం జరిగిందని గ్రహిస్తే న్యాయ పోరాటానికి వెనుకాడకూడదు.

యువకుడి ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

అప్పు తీర్చమని ఇచ్చిన రూ.3 లక్షలు ఆడేసి.. ప్రాణం తీసుకున్నాడు!



రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఓ సారి తప్పు చేశాడు. పెద్దవాళ్లు అప్పుల ఊబినుంచి బయటకు తీసుకొచ్చారు.అయినా మారని బుద్ధి చివరికి ప్రాణాలు తీసి భార్య, పిల్లలను రోడ్డున పడేసింది. శ్రీకాకుళం జిల్లా నిద్దాం గ్రామానికి చెందిన ఎర్నేన లక్ష్మంనాయుడు(31) ఎర్రవరంలోని ఓ ఫ్యాక్టరీలో క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పనిచేస్తూ రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నాడు. మూడేళ్ల కిందట వివాహం కాగా భార్య, కుమార్తె నిద్దాంలో ఉంటున్నారు. ఈ క్రమంలో లక్ష్మంనాయుడు ఆన్‌లైన్‌లో రమ్మీకి బానిసయ్యాడు. సుమారు రూ.6 లక్షలు అప్పులు చేశాడు. విషయం తెలుసుకున్న తండ్రి కాస్త మందలించి రూ.3లక్షలు తీర్చేశాడు. మరో రూ.3లక్షలు మిగతా అప్పులు తీర్చాలని లక్ష్మంనాయుడి ఖాతాలో జమచేశారు. అయితే వాటితో మళ్లీ రమ్మీ మొదలు పెట్టాడు. తిరిగి రూ.6లక్షల అప్పు చేశాడు. ఈ క్రమంలో 6న ఉదయం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వరసకు చిన్నాన్న అయిన పోతు రాజు ఉమామహేశ్వరరావు ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చివరి ఫోన్ టవర్ లోకేషన్ గామన్ బ్రిడ్జి పరిసరాల్లో చూపించింది. దీంతో గోదావరిలో గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం సమయంలో లక్ష్మంనాయుడి మృతదేహాన్ని గుర్తించారు.



అబల కాదు సబల!

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 11 : అబల కాదు సబల అనే మాటను అంగన్‌వాడీలు నిరూపించారు. ప్రభుత్వం భయపెట్టినా భయపడలేదు.. నోటీసులు ఇస్తున్నా అదరడం లేదు.. బెదరడం లేదు.. డిమాండ్ల సాధనకు గత 31 రోజులుగా ఆందోళన చేస్తూనే ఉన్నారు. అంగన్వాడీల నిరవధిక సమ్మె గురువారంతో 31వ రోజుకు చేరింది. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన 24 గంటల నిరాహారదీక్షలో రాజానగరం ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. అంగన్వాడీల నిరవధిక సమ్మె శిబిరం వద్ద సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి జువ్వల రాంబాబు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.బేబీరాణి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు అరుణకుమారి తదితరులు మాట్లాడారు.



పులిహోర గోవిందుడు!

బిక్కవోలు, జనవరి 11 : తూర్పు తిరుమల బలభద్రపురంలో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఏడవ రోజు తిరుప్పావడ అన్నకూటోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో విశేష ఉత్సవం నిర్వహించారు. 40 కిలోల పులిహోర, 10 కిలోల స్వీట్లతో స్వామి వారిని తయారు చేశారు. భక్తులు స్వామిని ఆసక్తిగా తిలకించారు.సాయంత్రం స్వామి, అమ్మవార్లను గజ వాహనంపై వుంచి పురవీధుల్లో ఊరేగించారు.స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధ్యక్షుడు గంగారెడ్డి తెలిపారు.

'మునిసిపల్ కార్మికులను మోసగిస్తే మళ్లీ సమ్మె తప్పదు'

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 11 : మునిసిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదాపడిందని, చర్చలు సానుకూలంగా జరిగినప్పటికీ మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తేనే కార్మికులకు న్యాయం జరిగినట్లు అవుతుందని సంఘ గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరం రెల్లిపేట వద్ద గురువారం రెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మినిట్స్ కాపీ వచ్చిన తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని, వైసీపీ ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తే మళ్లీ సమ్మె తప్పదన్నారు.సమావేశంలో ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, కిషోర్, బంగారు గిరి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

యువతిని ప్రేమించి మోసగించిన కేసులో 15 ఏళ్ల జైలు

గండేపల్లి, జనవరి 11: యువతిని ప్రేమించానని చెప్పి మానసికంగా, శారీరకంగా మోసగించిన వ్యక్తికి రాజమండ్రి 8వ అడిషనల్ స్పెషల్ జడ్జి వై.చెన్నయ్యనాయుడు 15 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్లు గండేపల్లి ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో యర్రంపాలెం గ్రామానికి చెందిన 29 ఏళ్ల బండి దుర్గాప్రసాద్ ఓ అమ్మాయిని ప్రేమించానని నమ్మించి మోసం చేయడంతో ఆమె అక్టోబరు 8, 2020లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేయగా సీఐ సురేష్ బాబు దర్యాప్తు చేశారు. వాదోపవాదనలు పూర్తయిన తర్వాత గురువారం జడ్జి తీర్పు వెలువరించారు.

హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా మేడపాటి షర్మిళారెడ్డి



రాజమహేంద్రవరం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి నియమితులయ్యారు. ఇటీవల రుడా చైర్‌పర్సన్‌గా ఆమెను కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన రెండో రోజునే వాటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఎంపీ మార్గాని భరత్‌రామ్ పట్టుపట్టి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుకు రుడా పదవి వచ్చేటట్టు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఆమెకు హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి దక్కింది. ఉత్తర్వులు స్వయంగా తీసుకుని షర్మిళారెడ్డి, ఆమె భర్త అనిల్‌రెడ్డి బయలుదేరినట్టు చెప్పారు.

హరిహర సదన్‌కు రూ.5 లక్షలు



ఆలయ పీఆర్వోకు విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, జనవరి 11: అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహర సదన్ కాటేజీకి గురువారం ఒక దాత రూ.5 లక్షలు విరాళంగా సమర్పించారు. నెల్లూరు జిల్లా కమ్మపాలెంనకు చెందిన బెల్లం జయసందీప్ ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రత్యేక దర్శనం ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



కాజులూరు, జనవరి 11: కాజులూరు శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఆకుల లక్ష్మణరావు(38) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన సలాది రాంబాబు ఇంట్లో డ్రిల్లింగ్ మిషన్‌తో పనిచేస్తుండగా విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించేలోపే లక్ష్మణరావు చనిపోయాడు. లక్ష్మణరావు జనసేన కార్యకర్తగా ఉన్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మణరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విరవాడలో దారుణహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



అప్పారావు(ఫైల్)

పిఠాపురం రూరల్, జనవరి 11: పిఠాపురం మండలం విరవాడలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన సిద్ధాంతపు అప్పారావు విరవాడలోని ఇటుకల బట్టీలో పనిచేస్తున్నాడు. అక్కడ భార్య చిన్నారి, ఇద్దరు పిల్లలతో కలిసి నాలుగేళ్లుగా నివాసముంటున్నాడు. ఇంట్లో అప్పారావు నిద్రిస్తుండగా గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి కత్తితో విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. భార్య కేకలు వేయడంతో సురేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా అప్పా రావు, సురేష్‌కు గతంలో ఖమ్మంలో ఇటుక బట్టీలో కలిసి పనిచేసే సమయంలో పరిచయం ఏర్ప డింది. వీరిద్దరికి గతంలో పలుమార్లు గొడవలు జరిగినట్లు చెబుతున్నారు. ఒక మహిళతో సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని సమాచారం. సంఘటనా స్థలాన్ని పిఠాపురం సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ పరిశీలించారు.

శ్రీప్రకాష్‌లో సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు

పెద్దాపురం, జనవరి 10: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలతో పాఠశాలలో సందడి చేశారు. భోగి మంటలు, డూడూ బసవన్నల ఆటలు, బొమ్మల కొలువులు, పతంగులు, రంగురంగుల రంగవల్లులు, జంగమదేవరలు, హరిదాసుల కీర్తనలు, తొక్కుడు బిళ్ల, దూదూపుల్ల ఆటలతో పల్లె వాతావరణం తలపించేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. దీంతో పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేందుకు తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే వంటింటి మహారాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల సీని యర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం, సమీర, మేనేజర్ రామకృష్ణ, ఆకడమిక్, కల్చరల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



విజయ్‌ప్రకాష్‌తో బాలిక సరదా ముచ్చట

800 అడుగుల భోగి దండ



భోగి దండతో కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్, జనవరి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమనస పంచాయతీ పరిధిలోని రంగాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు భూపతిరాజు విశ్వనాథరాజు కోడలు శ్రీరామసత్య దేశీయ ఆవుపేడతో 800 అడుగుల భోగి పిడకల దండ తయారు చేసింది. పిల్లలు మౌక్తిక, కార్తీక సహకారంతో 15 వేల భోగి పిడకలతో దండను రూపొందించింది.

జగన్‌ను దళితులే ఓడిస్తారు

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11: అధికారాన్ని ఇచ్చిన దళితులే ముఖ్యమంత్రి జగన్‌ను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి గద్దె దించబోతున్నారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చాక దళితుల జీవితాలు బాగుపడతాయని ఆశించిన వారి ఆశలపై నీళ్లు చల్లాడన్నారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు వంటివి అధిక మయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత యువకులను కొట్టిచంపితే రూ.10 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోవడం, అత్యాచారం చేసి చంపితే నిందితులను అరెస్టులు చేయకుండా అడ్డుపడడం, ఇద్దరు దళిత యువకులకు శిరోముండనం చేస్తే చర్యలు తీసుకోకపోవడం, డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా ఇబ్బందులకు గురిచేసి అతను చనిపోవడానికి కారణం కావడం ఇలా అనేక సంఘటనలు ఉన్నాయన్నారు. అందుకే దళితులంతా ఏ ఓటుతో జగన్‌ను సీఎం చేశారో అదే ఓటు తో కిందకు దించబోతున్నారని చెప్పారు. వచ్చే నెల 8న రాజమహేంద్రవరం బొమ్మూరులో దళిత సింహగర్జన నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభ ద్వారా దళితుల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. అమలాపురం నుంచి తాను ఎంపీగా పోటీ చేస్తున్నానని చెప్పారు. సమావేశంలో జీవీ శ్రీరాజ్, యర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లి ఒడికి చేరిన చిన్నారి

తల్లిని గుర్తించి క్షేమంగా అప్పగించిన పోలీసులు



చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న సీఐ విజయ్ శంకర్

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రైల్వే పోలీసుల(జీఆర్పీ) ప్రత్యేక చొరవతో తల్లి నుంచి దూరమైన చిన్నారిని నెలన్నరలో తిరిగి ఆమె ఒడికి చేర్చారు. జీఆర్పీ సీఐ విజయ్ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతేడాది నవంబరు 18న రాజమండ్రి రైల్వే స్టేషనులోని ఏడాదిన్నర పసిపాప ఒంటరిగా ఏడుస్తోందంటూ డ్యూటీలో ఉన్న ఆర్పీహెచ్‌సీ ఎస్‌వీవీ సత్యనారాయణకు చెప్పారు. ఆయన ఏఆర్ఎస్ఐ ఎస్.సత్యనారాయణతో హుటాహుటిన వెళ్లి పాపను సంరక్షించి వివరాల కోసం వాకబు చేయగా ఫలితం లేకపోయింది. దీంతో కేసు నమోదు చేసి.. చైల్డ్ వెల్ఫేర్ వాళ్లకు సమాచారమివ్వగా వాళ్లు పాపను తీసుకెళ్లారు. సీఐ విజయ్ శంకర్ పర్యవేక్షణలో ఆర్పీ ఎస్ఐ పి.లోవరాజు, ఆర్పీ ఎస్ఐ కె.మావుళ్లు కేసు దర్యాప్తు చేపట్టారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారాన్ని కల్పించారు. ఇన్‌స్టాగ్రాంలో చూసిన పాప బంధువు ఒకరు కాట్రేనికోన మండలం కొత్తపాలెంకి చెందిన పాప తల్లి ఓలేటి కావేరికి విషయాన్ని చేరవేశారు. దీంతో ఆమె జీఆర్పీ పోలీసులను గురువారం ఆశ్రయించగా పాపను అప్పగించారు. ఆ రోజున తల్లి ఇంటికి బయలుదేరి పాప తినడానికి ఏదైనా తీసుకురావడానికి స్టేషను బయటకు వెళ్లగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆమె కళ్లు తిరిగి పడిపోయిందని.. తర్వాత వచ్చి చూడగా పాప కనబడకపోవడంతో అప్పటి నుంచీ వాళ్లు వెతుకుతున్నారని సీఐ చెప్పారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ విజయ్ శంకర్, ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు ఇతర సిబ్బందికి రైల్వే పోలీసు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, రైల్వే డీఎస్పీ బీమీఎస్ నాగేశ్వరరావు ప్రశంసించారు.

సోదరుడి హత్య కేసులో ఏడేళ్ల జైలు

రాజవొమ్మంగి జనవరి 11: తన సోదరుడిని తలపై కొట్టి చంపిన ఘటనలో నిందితుడికి గురువారం ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని కొమరాపురం గ్రామానికి చెందిన మార్తి వేంకటేశ్వరులు(60) ఇంటి స్థలాల విషయంలో తన తమ్ముడు తాతారావుతో ఘర్షణ పడి, కర్రతో తన తమ్ముడిని తలపై కొట్టడం వల్ల తాతారావు చనిపోయాడు. 2021లో జరిగిన ఈ ఘటనపై అప్పటి సీఐ నాగదుర్గారావు కేసు నమోదు చేసి వేంకటేశ్వరులుని అరెస్టు చేయగా, వేంకటేశ్వరులు బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టు విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు అరెస్టు చేసి జైలుకు పంపారు. రాజమండ్రి కోర్టులో గురువారం వేంకటేశ్వరులుకు ఏడేళ్లశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

తూర్పుగోదావరి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం, జనవరి 11: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని 59 సెక్టార్ అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చింతూరు నుంచి సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ పీవో కె.చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదికలు సమర్పించాలన్నారు. బూత్ స్థాయి, రూట్, సెక్టార్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి సమన్వయం చేసుకొని చర్చించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో సమస్యలుంటే తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ జి.డేవిడ్ రాజ్, డీఈఈలు చైతన్య, రాజేంద్రబాబు, ఏటీడబ్ల్యూవో రామతులసి, ఎలక్షన్ డ్యూటీ ఎస్‌వీవీ సత్యనారాయణ, అన్ని మండలాల తహశీల్దార్లు, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

యువహో క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఓఎస్డీ మహేశ్వరరెడ్డి

చింతూరు, జనవి 11 : ఆదివాసీ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు పోలీసు శాఖ యువహో పేరిట క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం ఓఎస్డీ మహేశ్వరరెడ్డి చెప్పారు. ఇందులో భాగంగా గురువారం ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన చింతూరు మండలం, అల్లిగూడెంలో పోలీసు శాఖ వాలీబాల్ పోటీలను నిర్వహించింది. పోటీలను ఓఎస్డీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోటీలలో 40 జట్లు పాల్గొన్నాయని వీరిలో విజేతగా అల్లిగూడెం జట్టు నిలిచిందని, రెండో విజేతగా నారకొండ యువత బహుమతిని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. మహిళా విభాగంలో ఆరు జట్లు పోటీలలో పాల్గొనగా వారిలో అల్లిగూడెం, సూరకుంట గ్రామాలు ఒకటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయన్నారు. వారికి నగదు బహుమతులు అందించినట్లు చెప్పారు. అదే దశలో తమ శాఖ నిర్వహించిన వైద్య శిబిరానికి 349 మంది హాజరై ఉచిత వైద్యాన్ని పొందారని ఓఎస్డీ తెలిపారు. ఆదివాసీ కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేసినట్లు చెప్పారు. చింతూరు మండలంలోని ఏడుగురాళ్లపల్లి నుంచి మల్లెంపేట, పేగ నుంచి జగ్గవరం వరకు తారు రోడ్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. పదప ఆయా గ్రామాలకు గాను ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కల్పించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. అల్లిగూడెం ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించే క్రమంలో ఆర్వో ప్లాంటు మంజూరు చేయించినట్లు చెప్పారు. విద్యుత్ సౌకర్యం లేని ఆదివాసీ గ్రామాలకు త్వరలోనే విద్యుత్ వెలుగులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా, 42వ బెటాలియన్ కమాండెంట్ సురేష్‌కుమార్, సర్పంచ్ చంద్రయ్య, ఎంపీటీసీ నాగరాజు, రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని పలువురు సీఐ, ఎస్ఐలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేసి విజయం సాధించాలి



చంద్రబాబుతో శీతంశెట్టి

రంపచోడవరం, జనవరి 11: తెలుగుదేశానికి ఒకప్పటి కంచుకోటగా ఉన్న రంపచోడవరం నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా తిరిగి ఎగరాలని, ఇందుకు పార్టీ నేతలు, నాయకులంతా ఐక్యంగా పని చేయాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబు అన్నారు. తునిలో బుధవారం తనను కలిసిన రంపచోడవరం మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, వంతల రాజేశ్వరి తదితర నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పార్టీ విజయం కోసం అందరూ కలిసి పనిచేయాలని, పార్టీ అధికారంలోకి వచ్చాక అందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. రంపచోడవరం టికెట్ ఆశావహులు గొర్లె సునీత, మిరియాల శిరీష, కారం పోశమ్మ తదితరులు కూడా చంద్రబాబును కలిశారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

మోతుగూడెం, జనవరి 11: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ చదలవాడ గ్రామంలో పోలింగ్ బూత్‌లను రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, ఎలక్షన్ రూరల్ ఆఫీసర్ పోలింగ్ బూత్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం చింతూరు, కూనవరం, వీఆర్‌పురం పరిశీలించారు. వారి వెంట చింతూరు తహసీల్దార్ సుబ్బయ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

ఎటపాక, జనవరి 11: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్‌బాబు అన్నారు. కృష్ణవరం గ్రామంలో గురువారం తెలుగు యువత ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు మెమోరియల్ మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అయితే తొలిరోజు ఈ టోర్నమెంట్‌లో 8 జట్లు తలబడ్డాయి. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు దానే ప్రసాద్, క్లస్టర్ యూనిట్ ఇంచార్జ్ మాచినేని రాజేశ్వరి, గొమ్ముకొత్తగూడెం ఎంపీటీసీ పాయం దేవి, టీడీపీ నాయకులు బొల్లా నగేష్, కంటే నందు, కణితి మధు, సోయం గణేష్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో గన్నవరం జట్టు విజేత

ఎటపాక, జనవరి 11: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి కబడ్డీ పోటీల్లో గన్నవరం జట్టు విజేతగా నిలిచింది. డా.పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో మొత్తం 14 జట్లు పాల్గొన్నాయి. అయితే ఫైనల్ మ్యాచ్‌లో గన్నవరం, విస్సాపురం జట్లు తలపడ్డాయి. హోరాహోరీ పోరులో గన్నవరం జట్టు విజేతగా నిలిచింది. త్వరలో జరగనున్న డివిజన్ స్థాయి పోటీలకు గన్నవరం జట్టు ఎంపికైంది. గన్నవరం జట్టును పలువురు అభినందించారు.

అంగన్వాడీల సమ్మెపై రౌండ్ టేబుల్ సమావేశం

రంపచోడవరం, జనవరి 11: అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని, అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు లోతా రామారావు, కారం సురేష్‌బాబు, పాపోలు శ్రీను, కుర్ల రాజశేఖర్‌రెడ్డి, పల్లపు వెంకట్, కె.శాంతిరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

చింతూరు, జనవరి 11: అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన అల్లిగూడెం గ్రామానికి చెందిన మడకం సీతయ్య కుటుంబానికి చింతూరు మండల టీడీపీ గురువారం నిత్యావసర వస్తువులను అందజేసింది. ఇల్లు కాలిపోయిందనే విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించింది. కార్యక్రమంలో తెలుగు యువత మండల కార్యదర్శి సీలం తమ్మయ్య, నాయకులు పొదిలి రామారావు, కుంజ బాలకృష్ణ, సరియం బ్రహ్మయ్య సోడె శ్రీను, సరియం శ్రీను, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొప్పవరంలో నూరుశాతం పన్నుల వసూలు

అనపర్తి, జనవరి 11: అనపర్తి మండలం కొప్పవరంలో నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేసి రికార్డు సాధించినట్టు సర్పంచ్ కర్రి బులిమోహన్‌రెడ్డి తెలిపారు. వరుసగా మూడు సంవత్సరాలుగా తక్కువ సమయంలో నూరుశాతం పన్నులు వసూలు చేసినట్టు చెప్పారు. ముందు ఏడాది 18 రోజులు, గత ఏడాది 15 రోజుల్లో నూరు శాతం వసూలు చేయగా ఈ ఏడాది 14 రోజుల్లోనే వంద శాతం పన్నులు రూ.8.92 లక్షలు వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి తాడి వెంకటకృష్ణారెడ్డిని, సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను జిల్లా పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ అభినందించినట్టు సర్పంచ్ తెలిపారు.

బీసీలకు భరోసానిచ్చేందుకే 'జయహో బీసీ'

» టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 11: వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలకు రక్షణ కరువైందని, వారికి రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తోందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత టీడీపీదేనని, 34శాతం ఉన్న రిజరేషన్లను 24శాతానికి తగ్గించి జగన్‌రెడ్డి బీసీలకు అన్యాయం చేశారన్నారు. బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం మినహా ఒక్క రూపాయి నిధులు కూడా వెచ్చించలేదన్నారు. ఈనెల 19న బిక్కవోలులో జయహో బీసీ కార్యక్రమం ప్రారంభించి తర్వాత మిగిలిన మండలాల్లో నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో బీసీ ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేకుండాపోయిందన్నారు. సమావేశంలో త్రిమూర్తులు, జుత్తుగ కృష్ణ, కర్రి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, లాలయ్య, మామిడిశెట్టి శ్రీను, సూర్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారంటీ

కడియం, జనవరి 11: తెలుగుదేశం పార్టీతోనే ప్రజలకు మేలు జరుగుతుందని, భవిష్యత్తుకు గ్యారంటీ లభిస్తుందని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అంగర రామ్మోహనరావు అన్నారు. కడియంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన మేనిఫెస్టోను ప్రజలకు వివరించి బాండ్లను అందజేశారు. ఇదిలా ఉండగా కడియంలో ఎంపీపీ ప్రసాద్ కార్యాలయం వద్ద జరిగిన పార్టీ సమావేశంలో రామ్మోహనరావు మాట్లాడుతూ టీడీపీ బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించగా దానిని వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించి, అన్యాయం చేసిందన్నారు. బీసీ వర్గాలకు జరిగిన అన్యాయంపై చైతన్య పరిచేందుకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, చెల్లుబోయిన శ్రీను, షేక్ సుభాన్, వెలుగుబంటి నాని, మజ్జి పద్మ, పిల్లా తనూజ, బండి నాగమణి, తామెళ్ళ అయ్యప్ప, జనసేన నాయకులు చిలుకూరి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.



కడియంలో వాహనాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు



అనపర్తి సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

నేడు జయహో బీసీ సభ : బీవీఆర్

కోరుకొండ/రాజానగరం, జనవరి 11: ఈ నెల 12న మండలంలోని బూరుగుపూడి గేటు వద్ద టీడీపీ కార్యాలయం ఆవరణలో జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు జరగబోయే ఈ సదస్సులో కోరుకొండతోపాటు రాజానగరం, సీతానగరం మండలాల టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు రాజముద్ర బహూకరణ

కోరుకొండ, జనవరి 11: తునిలో సభ ముగించుకుని తిరిగి వెళుతున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు మధురపూడి విమానాశ్రయం వద్ద కోరుకొండకు చెందిన టీడీపీ నాయకుడు మాతా ప్రభ నాలుగు సింహాల రాజముద్రను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన నిజాయితీగా కలిసి పని చేయాలని ఆదేశమిచ్చారని చెప్పారు.

ప్రకృతికి కృతజ్ఞతలు తెలపడమే పండుగలు

» నాట్యపండితుడు సప్పా దుర్గాప్రసాద్
» పలుచోట్ల సంక్రాంతి ముందస్తు సంబరాలు



ఎస్‌కేవీటీ కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 11 : మనిషి మనుగడకు ప్రకృతే సర్వస్వం అని, అందుకు కృతజ్ఞతలు తెలపడమే పండుగలు అని నాట్యపండితుడు సప్పా దుర్గాప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లలిత కళాసమితి ఆధ్వర్యంలో గురువారం మకర ఉత్సవ్ పేరిట నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన మాట్లాడారు. తల్లి వంటి తెలుగును మరువరాదని, పుట్టి పెరిగిన సంప్రదాయాన్ని మర్చిపోతే మానవ జీవితానికి అర్థం ఉండదన్నారు. మెహందీ, రంగోలి, సంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహించారు. విజేతలకు చీరల సీతారామనాయుడు సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు స్వర్ణశ్రీ, లలిత కళాసమితి ఉపాధ్యక్షుడు పీవీబీ సంజీవరావు, సీపీడీసీ సభ్యులు జి.సత్యనారాయణ, అధ్యాపకులు డీవీ రమణమూర్తి, జి శరత్‌బాబు, జి.రమణ, సూపరింటెండెంట్ మేడూరి నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల, సత్యభామ పాఠశాల, సాయిమాధవి డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు, గంగిరెద్దులు, భోగి మంటలతో సందడి వాతావరణం నెలకొంది. విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంతరెడ్డి భోగి మంటను వెలిగించారు. అధ్యాపకులు సంక్రాంతి విశిష్టతను వివరించారు. కళాశాలల ప్రాంగణంలో విద్యార్థులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ప్రిన్సిపాల్ తాడి సతీష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం 48వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య రంగవల్లులను తిలకించారు. విజేతలకు బీరువా, కుర్చీలు బహుమతులుగా శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో మాలే విజయలక్ష్మి, కప్పల వెలుగు కుమారి, కోసూరి చండీప్రియ, బోను ఈశ్వరి, చాపల చిన్నరాజు, సింహనాగమణి, అప్సరి, కర్రం లక్ష్మీనాయుడు పాల్గొన్నారు. అలాగే రాజమహేంద్రవరం షిరిడీసాయి విద్యానికేతన్‌లో గ్రౌండ్స్‌లో రెడ్ఎఫ్ఎమ్ 93.5, ఆశీర్వాద్ మసాల శ్రోతలతో కలిసి ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు, భోగిమంటలు, పిండివంటలు బసవన్న ఆటలు వంటి పోటీలను 100 మందితో నిర్వహించారు. స్టేషన్ హెడ్ కెఎస్‌నిహార్ హాజరయ్యారు. విజేతలకు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మంగతాయారు, ఆర్‌కే డిస్ట్రిబ్యూటర్ ఎండీ వెంకట్ బహుమతులు అందించారు.

కోరుకొండ: కోరుకొండలో శ్రీ షిర్డిసాయి పాఠశాలలో నిర్వాహకురాలు గరగ లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులు రంగవల్లులు వేసి గాలిపటాలు ఎగురవేశారు. భోగి మంటలు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు.

సెపక్‌తక్రా నన్నయ వర్శిటీ జట్టు ఎంపిక



సెపక్‌తక్రా పోటీలను ప్రారంభిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 11: జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరచి విజయం సాధించాలని వీసీ కె.పద్మరాజు కోరారు. విశ్వవిద్యాలయ సెపక్‌తక్రా పురుషుల జట్టు ఎంపికలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నన్నయ వర్శిటీ గోదావరి జిల్లాల్లో నైపుణ్యం గల క్రీడాకారులకు చక్కని వేదికగా మారిందన్నారు. సెపక్‌తక్రా ఎంపిక పోటీలు నిర్వహించి టి.షణ్ముఖ్‌శ్రీవంశీ, కె.పవన్‌కుమార్, సీహెచ్ మోహనకృష్ణ, టి.బాలయేసు, జె.బాలనాగేశ్వరరావు, ఎం.దుర్గాచందు, కె.వెంకటసత్యసూర్యలను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, వి.సల్మాన్‌దేవానంద్, సీహెచ్.సుబ్రహ్మణ్యం, టి.యోగశ్రీ, క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

రాజానగరం, జనవరి 11: మండలంలో నరేంద్రపురంలోని గుత్తుల కృష్ణవేణిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూజిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణవేణి ఒంటరి మహిళ అని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోందని, ఈ నెల 3వ తేదీ రాత్రి గ్రామానికి చెందిన పెంకే దుర్గారావు, అతని కుటుంబీకులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని రాజమహేంద్రవం ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. అయితే బాధ్యులపై ఇప్పటివరకు ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ తహశీల్దార్ పవన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు భీమశంకర్ బాధితుల తరపున ఆందోళన చేసిన వారిలో ఉన్నారు.

కథా రచనలో గైట్ ఫార్మసీ విద్యార్థిని ప్రతిభ

రాజానగరం, జనవరి 11: యువజన సేవల కమీషనర్ ఆధ్వర్యంలో ఇటీవల విజయ వాడలోని కేఎల్ యూనివర్శిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్.ఆర్యకు తృతీయ బహుమతి లభించినట్టు గైట్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు ఫోక్ డ్యాన్స్, ఫొటోగ్రఫీ, ఫోక్ సాంగ్, పోస్టర్ మేకింగ్, స్టోరీ రైటింగ్(కథారచన) తదితర అంశాలపై పోటీలు నిర్వహించారన్నారు. దీనిలో స్టోరీ రైటింగ్‌లో హార్య తృతీయ స్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ ధనరాజు, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా అభినందించారు.

వీఆర్ఏ ప్రసాద్ మృతికి సంతాపం

గోకవరం, జనవరి 11: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తూ, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొల్లాటి ప్రసాద్ పట్ల పలువురు సహచర ఉద్యోగులు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు. అలాగే గోకవరం, బిక్కవోలు తహశీల్దార్లు శ్రీనివాసరావు, కంగుల పోసిబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అంత్యక్రియలు నిమిత్తం తహశీల్దార్ శ్రీనివాసరావు ప్రభుత్వం తరపున రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సమ్మెట మోహన్, సర్పంచ్ రామలక్ష్మి, పెనికేటి అచ్చిరాజు, పలు గ్రామాల వీఆర్వోలు, సిబ్బంది పాల్గొని ప్రగాఢ సంతాపం తెలిపారు.

నేడు జిల్లాకు కార్మిక చైతన్య బస్సుయాత్ర

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11: టెక్కలిలో ఈ నెల 6న ప్రారంభమై కుప్పం వరకు సాగుతున్న కార్మిక చైతన్య బస్సుయాత్రను విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్య క్షుడు యర్ర మోతు ధర్మరాజు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. టీఎన్‌టీయూసీ బస్సు యాత్ర ఈనెల 12న రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోకి ప్రవేశిస్తుందని కడియపులంక వద్ద బస్సుకు స్వాగతం పలుకుతామని చెప్పారు. శుభమస్తు ఫంక్షన్ హాలులో 13న ఉదయం 9 గంటలకు మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నామని ఇందులో రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, బాధ్యులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో తీడ ఆదిబాబు, దాసరి శ్రీనివాస్, పాతూరి గిరిధర్, ఎర్రంశెట్టి రాజకుమార్, నీలి కిషోర్, గజ్జరపు ప్రసాద్, శీలం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డు తీసుకోవాలి

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ్ కార్డు కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ ఎస్ఏ)కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. సీటీఆర్ఐ సమీపంలోని విశ్వకర్మ వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. నల్సావారి అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ సేవల పథకం-2015 ద్వారా డీఎల్ఎస్ఏ అమలు చేస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు షేక్ జబీన, టీఎస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ప్రభుత్వ నోటీసులు

సీతానగరం, జనవరి 11: అంగన్‌వాడీ సెంటర్ల వద్ద ప్రభుత్వం నోటీసులు అంటించింది. తమ డిమాండ్ల సాధనకు 31 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె నేపథ్యంలో గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది అంగన్‌వాడీ సెంటర్ల వద్ద షోకాజ్ నోటీసులు అంటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ రిజిస్టర్ పోస్టులో కూడా నోటీసులు పంపారని, తమ న్యాయమైన డిమాండ్ల కోసం కోర్టునైనా ఆశ్రయిస్తాం గాని ప్రభుత్వం ఎంత బెదిరించినా సమ్మె ఆపబోమన్నారు.

వితంతువును వేధిస్తున్న ఇద్దరిపై కేసు

బిక్కవోలు, జనవరి 11: బిక్కవోలు సత్తెమ్మపేటకు చెందిన వితంతును వేధిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. సత్తెమ్మపేటకు చెందిన మంత్రి అప్పలనాయుడు తాను తన భర్త రూపంలో వున్న ఆత్మను అంటూ వేధించేవాడు. దీంతో బుధవారం రాత్రి పెద్దల్లో తగవు పెట్టగా పెద్దల ముందు ఆమెను దుర్భాషలాడాడని, అప్పలనాయుడు కొడుకు అయ్యప్ప పెద్దలను బూతులు తిడుతూ వితంతువును కింద పడేసి కాళ్లతో తన్నడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

తగవు పేరుతో పిలిచి గాయాలు..

ఇదిలా ఉండగా బుధవారం రాత్రి తగవు వుందని పెద్దలు పిలుస్తారంటూ తనను దుర్గమ్మ గుడికి తీసుకెళ్లారని, ఆపై వితంతువు పార్వతికి లెటర్స్ రాస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నావంటూ పార్వతి కుమారుడు సురేష్, లంక సుబ్రహ్మణ్యం, ఆదినారాయణ, అప్పారావు, పార్వతి.. తనను కర్రలతో కొట్టి గాయపరిచారని, అప్పలనాయుడు అన్నాడు. తన స్నేహితుడు అనపర్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడని, మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారని చెప్పాడు. అప్పలనాయుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై చేశామని ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం : డీఎస్పీ

కడియం, జనవరి 11: కడియం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన షటిల్‌కోర్టులో సీఐ నేతృత్వంలో రెండు రోజుల పాటు జరిగే బ్యాడ్మింటన్ పోటీలను గురువారం సౌత్‌జోన్‌డీఎస్పీ కె.శ్రీనివాసులు ప్రారంభించారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పోటీలకు పిలుపునివ్వగా 37 టీమ్‌లు సీనియర్, జూనియర్ విభాగాలకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు మొహ్మద్ అష్ఫక్, బాలాజీ సుందర్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన కొల్లపు వేణు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11: రాజమహేంద్రవరానికి చెందిన ఉద్యమ నాయకుడు కొల్లపు వేణు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు గురువారం ఆయన నగరంలో వివరాలు వెల్లడించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన ఆయన రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదాలపై రాహుల్ గాంధీ ప్రకటించిన అంశాలు నచ్చి కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపారు.

నియోజకవర్గ స్థాయి మాస్టర్ శిక్షకులకు శిక్షణ

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయి మాస్టర్ శిక్షకులు తమకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత సూచించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన నాలుగు ప్రధాన బృందాలతో నియోజకవర్గ స్థాయిలో శిక్షణ ఇస్తారన్నారు. మొత్తం 7 నియోజక వర్గాల్లో శిక్షణ ఇవ్వడానికి 75 మందిని నియమించినట్టు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల తేదీని అనుసరించి శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు. శిక్షణకు ల్యాప్‌టాప్, ప్రొజెక్టర్ సౌకర్యం, 40మంది నుంచి 50మందికి ఒకేసారి శిక్షణ ఇవ్వవలసి ఉందన్నారు. సమావేశంలో జేసీ ఎన్.తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2,26,966 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించిన రూ.2.52 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 46,355 మంది రైతుల నుంచి 2,26,966 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు జేసీ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు.ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకూ రైతులకు రూ.424 కోట్ల 67 లక్షలు వారి ఖాతాల్లో జమచేశామన్నారు.

కిషోర్ మాస్టర్‌కు సంక్రాంతి పురస్కారం

అనపర్తి, జనవరి 11: అనపర్తిలోని కేపీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కిషోర్‌కుమార్ ఏలూరులో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ప్రభుత్వ యంత్రాంగం సంయుక్తంగా గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో సంక్రాంతి పురస్కారం అందు కున్నారు. ఈ సంబరాల్లో కిషోర్‌కుమార్ వినిపించిన కవితా గానానికి సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చేతులమీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్‌ను పలువురు అభినందించారు.

వైభవంగా గోదాదేవి కూడారై ఉత్సవం

కోరుకొండ, జనవరి 11: పవిత్ర ధనుర్మాసం సందర్భంగా గురువారం తిరుప్పావై పారాయణంలో కూడారై పాశురం సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు జరిగాయి. కూడారైలో 108 గంగాళాలలో పాయసాన్ని శ్రీరంగనాథునికి నైవేద్యంగా సమర్పించడం ముఖ్యమైన ఘట్టం. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి, హరేరామ సమాజం వద్ద వేంకటేశ్వరస్వామి, ఆర్యవైశ్య కోదండ రామాలయం, పశ్చిమగోనగూడెం గీతామిషన్ వద్ద 108 గంగాళాల పాయసాన్ని స్వామి వారికి సమర్పించి కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు పాయసాన్ని అందజేశారు. కార్యక్రమంలో పరాసర రంగరాజ భట్టర్, ఇరగవరపు కృష్ణామాచార్యులు, అనంతాచార్యులు, ఎంవీఎస్ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

అనపర్తి, జనవరి 11: మండలంలోని కొప్పవరం శివారులో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పేకాట జరుగుతుందన్న సమాచారంతో దాడులు నిర్వహించి పేకాడుతున్న ఐదుగురి అరెస్టు చేసి వారి నుంచి రూ.14250 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి సిగ్నల్ వద్ద సైకిల్‌తో ఓ వృద్ధులు పట్టాలు దాటడానికి ప్రయత్నిస్తుండగా గూడ్స్ రైలు ఢీకొ నడంతో దుర్మరణం చెందాడు. అతడి వయసు సుమారు 70ఏళ్లు ఉంటుందని, అక్కడ ఉన్న కీమెన్ హుటాహుటిన 108లో ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయిందని ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్పీ) సీఐ విజయ్ శంకర్ తెలిపారు. వృద్ధుడి వివరాలు తెలిసిన వాళ్లు ఫోన్ నెం.8985101324, 99631807668 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

పామాయిల్ తోటల పెంపకంపై అవగాహన


రంగంపేట, జనవరి 11: పామాయిల్ తోటల పెంపకం మెట్ట రైతులకు వరమని పతంజలి గ్రూప్‌కి చెందిన పెద్దాపురం పామాయిల్ ఫ్యాక్టరీ డీజీఎం రవీంద్ర అన్నారు. గురువారం మండలంలోని సింగంపల్లిలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సగటున ఎనిమిది టన్నులుగా ఉన్న గెలల దిగుబడి కొద్దిపాటి శ్రద్ధతో పది టన్నులకు పెంచుకోవచ్చన్నారు. ఫ్యాక్టరీ సాంకేతిక సిబ్బంది ఓంకార్ సత్యనారాయణ వెంకట్రావు, ఉద్యానశాఖ ప్రతినిధులు అరవింద్, రామకృష్ణ పాల్గొన్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ

బిక్కవోలు, జనవరి 11: ఊలపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం జడ్పీటీసీ రొంగల పద్మావతి జిల్లా పరిషత్ వారు ముద్రించిన టెన్త్ క్లాస్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

బిక్కవోలులో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

బిక్కవోలు, జనవరి 11: బిక్కవోలు శివారు లింగాల చెరువు గట్టుపై వున్న చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతిచెందాడు. లింగాల చెరువు వద్ద కాపలా వుంటున్న తుమ్మల పల్లికి చెందిన మాదే పోతయ్య గురువారం ఉదయం ఈ విషయాన్ని వీఆర్వో కొటాని అశోక్‌కుమార్‌కు తెలపడంతో అక్కడికి చేరుకుని మృతుడి వయస్సు 40-50 మధ్య ఉంటుందని, చుట్టుపక్కల వారిని విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.బుజ్జిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి ఒంటిపై ఎరుపురంగు బనియన్, పచ్చరంగు నిక్కరు ఉన్నాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.





కత్తులు దూస్తున్న పోలీసులు

పోలీసులు కత్తి కాంతారావులే.. ముందు కత్తిదూయడం.. ఆ తరువాత చల్లబడిపోవడం వారికి అలవాటే.. ఆ నాలుగు రోజులు హడావుడి చేస్తారు.. ఆ తరువాత ఏడాదంతా ఎదురుచూస్తారు. మళ్లీ కోడి పందేల సీజన్ వచ్చినప్పుడు మామూలే.. మళ్లీ కత్తి దూస్తారు.. అయితే ఏడాది నుంచి ఆ కత్తుల తయారీపై మాత్రం దృష్టి పెట్టరు. అంతా తెలిసినా మిన్నకుండిపోతారు.. చివరిలో మాత్రం అడపాదడపా కేసులు నమోదు చేసి మేమున్నామంటారు.. ఆరంభం నుంచే కోడికత్తుల తయారీ అడ్డుకుంటే చివరిలో ఈ ఇబ్బంది ఉండదు కదా అనేది జనం వాదన..

- తొడకొడుతున్న పందెం కోడి
- కత్తుల సంచులతో పందెగాళ్లు రెడీ
- ప్రతి ఏడాది హెచ్చరికలతో సరి
- నిద్దరోతున్న అధికార యంత్రాంగం
- సంక్రాంతి మూడు రోజులూ చూస్కో
- వైసీపీ నేతలకు ఆదాయ మార్గం?
- ఈ సారైనా కోర్టు ఆదేశాలమలయ్యేనా?
- గ్రామాల్లో సిద్ధమైన బరులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కోడి పందెం అంటే తాట తీస్తాం.. కత్తి కడితే కటకటాలే.. ప్రతి ఏడాదీ సంక్రాంతి సందర్భంగా అధికారులు చాలా బలంగా జారీ చేసే హెచ్చరికలివి. కానీ, 'బరి'తెగించడం.. పందెం కోడి తొడగొట్టి మరీ కత్తికట్టించుకోవడం కళ్లముందు జరిగే ఓ రసవత్తరమైన సినిమా. ఈ సారి కూడా ఆ బొమ్మ పడుతుందని పరిస్థితులు చెబుతున్నాయి. ఈ సినిమాలో అందరూ అనుకున్నట్టు కోడి పుంజు కాదు హీరో.. దానికి కట్టే కత్తి పదునైన హీరో. ఈ హీరో ముందు రియల్ హీరోలు ప్రతి ఏడాదీ డీలా పడిపోతూనే ఉన్నారు. సంక్రాంతి వచ్చిందంటే గోదావరి జిల్లాల పేరుచెబితే ఠక్కున గుర్తొచ్చేవి కోడి పందేలు. దీంతో కోడి పందేలకు విదేశాల నుంచి కూడా పందెంగాళ్లు,ఆసక్తి ఉన్నవాళ్లు రెక్కలపై ఎగిరొచ్చి గోదారి జిల్లాల్లో వాలిపోతుంటారు.ఇది ప్రతి ఏడాదీ జరిగే తంతు. వాస్తవానికి సరదాలో భాగంగా పెద్ద పండుగకు కోడి పందేలను వేయడం పరిపాటి. అయితే క్రమంగా అది హింసతో కూడిన క్రీడ, వ్యసనంగా రూపాంతరం చెందింది. దీనికి ప్రధాన కారణం కోడి కత్తులనేది జగమెరిగిన వాస్తవం. ప్రతి ఏడాదీ వేలల్లో తయారవుతున్న కోడికత్తులపై దృష్టి సారించకుండా హెచ్చరికలు జారీ చేస్తూ కాలయాపన చేసి చివరికి పండుగ మూడు రోజులూ కళ్లుమూసుకోవడం యంత్రాంగానికి అలవాటుగా మారిన విషయం ఎవరూ కొట్టిపారేయలేని వాస్తవం.ఈ నేపథ్యంలో కోడీపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఒక్కో కత్తి రూ.700

సంక్రాంతి సీజన్‌కి కోడి పందేల కోసం వేల సంఖ్యలో కత్తులు తయారు చేస్తుంటారు. ఒక్కో కత్తి ధర రూ.300 నుంచి రూ.700 వరకూ ఉంటుంది. కత్తి కట్టే వాళ్ల వద్ద వందల్లో కత్తులు ఉంటాయి.వాటిని ఓ బెల్టులా ఉన్న మందపాటి వస్త్రానికి అమర్చి ఆ వస్త్రాన్ని చుట్టగా చుట్టి పందెం వద్దకు తీసుకొస్తారు.బరులు నిర్వహించేవాళ్లు రోజుకింత అని గంపగుత్తగా మాట్లాడుకుంటారు.మరికొందరు పందేన్ని బట్టి డబ్బులు తీసుకుంటారు. కత్తి కట్టే వాళ్లకు పందేనికి రూ.300 నుంచి రూ.1,000 వరకూ ముట్టచెబుతారు. కత్తి కట్టే వాళ్లకు తెలిసిన పందెంగాళ్లు అదనపు సొమ్ము కూడా చెల్లిస్తారు. కోళ్లు వందల్లో ఉంటే కత్తులు వేలల్లో ఎందుకనే అనుమానం రావొచ్చు. ఒకసారి పందేనికి వాడిన కత్తి ఆ రోజు మరో పుంజుకు కట్టరు. ఆ కత్తిని మళ్లీ సానబట్టించిన తర్వాతే వేరే పుంజుకు కడతారు. దీంతో పెద్ద బరుల్లో ఉండే కోడికత్తికట్టే వ్యక్తుల వద్ద ఒక్కో బెల్టులో కనీసం 20-30 కత్తులు ఉంటాయి. ఇలా వేలల్లో కత్తులు అందుబాటులో ఉంటున్నాయి.

కత్తులది ప్రధాన భూమిక..

కోడి పందేల్లో కత్తులది ప్రధాన భూమిక.అందుకే కోడి కత్తిని ప్రత్యేకంగా తయారు చేస్తారు.ముందు భాగంలో కత్తి.. దానికి అమర్చి కోడి కాలుకు కట్టడానికి వీలుగా ఊచ వంటి ఏర్పాటు ఉంటుంది.ఈ ఊచను 'కూలు' అంటారు. కత్తి, కూలు కలుపుకొని కోడి కత్తి 4 నుంచి 6 అంగుళాల పొడవు ఉంటుంది.కూలును తాడుతో కోడి కాలుకు బలంగా కడతారు.దీంతో కత్తి బెసకడం ఉండదు.ఆపరేషన్లు చేసే సర్జికల్ బ్లేడుతో సమానమైన పదునుతో ఉంటాయి. ఈ కత్తులను పండుగకు రెండు నెలల ముందు నుంచే రహస్యంగా తయారు చేస్తారు. కోడి కత్తి ఎట్టి పరిస్థితుల్లోనూ వంగి పోకుండా ఉంటుంది. కత్తి విరగాలే గానీ, వంగిపోకూడదని పందెంగాళ్లు చెబుతారు.దీనికోసం నాణ్యత కలిగిన ముడిసరుకు వాడతారు. ఉక్కుతో తయారైన కమాను కట్టలు, రైల్వేబెడ్లు వంటివి ఉపయోగిస్తారు.ఇప్పుడు కత్తి మరింత పదునుగా ఉండడానికి హెలీకాప్టర్ రెక్కలు తదితర విడిభాగాలను ఉపయోగిస్తున్నారని చెబుతున్నారు.పండుగ సీజన్‌లో కత్తి కట్టే వాళ్లకు చాలా డిమాండు ఉంటుంది.అడ్వాన్సులు చెల్లించి మరీ పందెం బరులు నిర్వహించేవాళ్లు కాపాడుకుంటారు.కత్తి,కత్తి కట్టే తీరుపైనే పందెం గెలవడం ఆధారపడి ఉంటుందని పందెంగాళ్లు నమ్ముతారు.కత్తి కట్టి నిర్వహించే కోడి పందేలపై నిషేధం ఉన్నా అది కాగితాలకే పరిమితమవుతోంది. ప్రాణాలు కోల్పోతున్న కోళ్లను చూస్తూ ఆవేదన చెందడం మాత్రమే జంతు ప్రేమికులకు మిగులుతోంది.



గతేడాది వేమగిరిలో బరి వద్దనే ఉన్న పోలీస్ జీప్



గోకవరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు

500 కత్తులు పట్టివేత

గోకవరం, జనవరి 11 : కోడి పందేలు నిర్వహణకు కోడి కత్తులు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను గోకవరం పోలీసులు అరెస్టు చేసి 500ల కోడి కత్తులు స్వాధీనం ఎస్.ఐ యు.శివ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముందుగా అందిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సహాయంతో దాడులు చేశామన్నారు. మండలంలోని వీరంద్ర కాలనీ సమీపంలో కోడి కత్తులు తయారు చేస్తుండగా ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు.వీరి నుంచి 233 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. వెలమపేటలో కోడి కత్తులు తయారు చేస్తుండగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 277 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ చెప్పారు. మండలంలో కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నిఘాపై కత్తి

ఈసారి కూడా పోలీసులు హెచ్చరికలతో సరిపెట్టినట్టు కనిపిస్తోంది.ఈ ఏడాది కచ్చితంగా కోర్టు ఆదేశాలను పాటిస్తామని.. కత్తి కడితే కఠిన చర్యలేనని ఉన్నతాధికారులు వల్లెవేసినా ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే గ్రామాల్లో చాటుమాటుగా పందేలు మొదలయ్యాయని సమాచారం. ఇక పెద్ద బరుల నిర్వాహకులు భోగి కోసం ఎదురు చూస్తున్నారు. బరులకు కావాల్సిన టెంట్లు, కర్రలు, అంగబలాన్ని సిద్ధం చేసుకొనే పనిలో బిజీ అయిపోయారు. జిల్లాలో కొన్ని కత్తుల తయారీ కేంద్రాల వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌ని ఇప్పటికే పైకంతో ప్రసన్నం చేసుకున్నారనే వాదన వినవస్తోంది. దీంతో ఉన్నతాధికారులు ఎంత కాలు దువ్వుతున్నా కంచే చేను మేయడంతో చేష్టలుడిగి చూడడం తప్ప చేసేదేమీ ఉండడం లేదు.ఇక్కడ ప్రత్యేకించి పోలీసు నిఘా ఏమైందనే వాదన బలంగా వినిపిస్తోంది.

నడిపేది వైసీపీ నాయకులే!

కోడి పందేల బరుల నిర్వహణలో వైసీపీ నాయకుల పేర్లే వినిపిస్తున్నాయి.మూడు రోజుల్లో కోట్లాది రూపాయలు జేబులో పడే అవకాశం ఉండడంతో ఈ జూద క్రీడను దగ్గరుండి ఆడిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో 'మీకు అందాల్సింది అందుతుంది.. మీరు అటువైపు రావొద్దు' అనే హెచ్చరికలు ఇప్పటికే వెళ్లాయని చెబుతున్నారు. ఇప్పటికే కోడి పందేల వద్ద అనుబంధ జూదాలైన గుండాట, పేకాట, మూడు ముక్కలాట, బోర్డులు, మాంసాహార, బిర్యానీ, కూల్‌డ్రింక్స్ తదితర స్టాల్స్ నిమిత్తం అడ్వాన్సులూ పుచ్చుకున్నారని గతేడాది వేమగిరి జంక్షను దగ్గర్లోని జాతీయ రహదారి పక్కనే పెద్ద పెద్ద టెంట్లు వేసి పెద్ద బరి నిర్వహించారు. జీపులో వచ్చి ప్రాంగణం చుట్టూ ఓ రౌండు వేసి వెళ్లే విధులను పోలీసులు నిర్వర్తించారు. ఈ బరి ఏర్పాటు చేసినవాళ్లు నగరానికి చెందిన ఓ వైసీపీ నేత అనుంగులు కావడం గమనార్హం. దీంతో ఇప్పుడూ అధికార బలం పోలీసుల కళ్లకు గంతలు కడుతుందనే వాదన వినిపిస్తోంది.

100 కత్తులు స్వాధీనం

పెరవలి, జనవరి 11 : సంక్రాంతికి కోడిపందాలు నిర్వహించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ సూర్యభగవాన్ హెచ్చరించారు. పెరవలి మండలం నడిపల్లి కోటకు చెందిన వీరమల్లు రామకృష్ణ వద్ద 40 కోడి కత్తులు, ఉండ్రాజవరం మండలం తాడిపర్రుకు చెందిన నందమూరి వెంకటేశ్వరరావు వద్ద 60 కోడి కత్తులు సీజ్ చేసి వారి ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ జగదీశ్, కొవ్వూరు డీఎస్పీ వర్మ ఆదేశాలు మేరకు నిడదవోలు సీఐ ఆధ్వర్యంలో గురువారం దాడులు చేసినట్టు తెలిపారు.



ఆఫర్ల వల

కొనుగోలుదారులకు డిస్కౌంట్లతో ఎర

ఫ్రీ..ఫ్రీ..ఫ్రీ.. మా షాపునకు రండి.. మీకు కావాల్సింది తీసుకెళ్లండి.. చివరిలో చిన్న చిన్న అక్షరాలతో ఉన్న షరతులు వర్తిస్తాయి..అనే మాట చూడకుండా ఆఫర్లకు ఎగబడిపోతున్నారు.. షాపునకు వెళ్లిన తరువాత మీరు ఎంత కొంటే అంత ఫ్రీ అంటున్నారు.. ఇంకేంటి బాగానే ఉంది కదా జేబు ఖాళీ చేసుకుని అవసరం ఉన్నా లేకపోయినా కొనుగోలు చేసుకుని ఇంటిబాట పడుతున్నారు. ఇలా వ్యాపారులు కొత్త కొత్తగా ఆలోచించి.. ఆఫర్ల వల వేసి వ్యాపారం పెంచుకుంటున్నారు.

- పండుగ వేళ ఆఫర్లే..ఆఫర్లు
- పాత స్టాకు, నాసిరకం క్లియర్
- ఆషాఢం, సంక్రాంతికి ధమాకా
- వినియోగదారుల జేబుకు చిల్లు
- వ్యాపారుల గల్లాపెట్టెలు గలగల
- కిటకిటలాడుతున్న దుకాణాలు
- పట్టించుకోని యంత్రాంగం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓ సినిమాలో చీరకు కారు ఫ్రీగా ఇస్తామన్నా కొనడానికి ఎవరూ ముందుకురారు.కానీ ఇవాళ కారుకు గుండుసూది ఉచితమంటే ఎగబడే పరిస్థితి.ఇదే అదనుగా పండుగ వచ్చిందంటే డిస్కౌంట్ల వల వేసి ఆఫర్ల మాయలో పడేసి గల్లాపెట్టెలు నింపుకుంటూ వినియోగదారుల జేబుకు పెద్ద చిల్లు పెడుతున్నారు.ఆషాఢం,సంక్రాంతి వచ్చిందంటే వ్యాపారులకు పెద్ద పండుగే. జనాల విజ్ఞతకు పెద్ద పరీక్షే. నష్టానికి ఎవరైనా ఎందుకు వ్యాపారం చేస్తారనే చిన్న లాజిక్ మిస్సవుతూ రాయితీలకు ఎగబడుతున్నారు.సామాన్యుడి ఆశను అలుసుగా చేసుకుంటున్న డిస్కౌంట్ల మాయాజాలంపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి తూర్పుగోదావరిలోనే కాకుండా విభజిత తూర్పు గోదావరిలో కూడా రాజమహేంద్ర వరం వాణిజ్యానికి పెట్టింది పేరు. అటు తూర్పు మన్యం, ఇటు కోనసీమ నుంచి కూడా వేడుకలు,పండుగలకు కొనుగోళ్లకు ఇక్కడకే జనాలు వస్తుంటారు. ముఖ్యంగా రోజూ కోట్లాది రూపాయల వస్త్ర వ్యాపారం జరుగుతుంటుంది.సంక్రాంతి సందర్భంగా డిస్కౌంట్లు, రిబేట్లు,ఆఫర్లు, బహుమతుల హడావుడి మొదలైంది. ఏకంగా 50%పైన రాయితీ ఇచ్చేస్తున్నారు. మార్చి నుంచి దాదాపు 7 నెలల పాటు ముహూర్తాలు లేకపోవడం,ఈ సారి ఎన్నికల సంక్రాంతి కావడంతో అటు వ్యాపారులు సాధ్యమైనంత ఎక్కువగా స్టాకును క్లియర్ చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

పాతస్టాకు.. నాసిరకం

ఏడాదిలో కొన్ని ప్రత్యేక రోజులు, పర్వదినాలు వ్యాపారులకు లాభసాటిగా మారాయనేది జగమెరిగిన వాస్తవం. ఆషాఢం వచ్చిందంటే క్లియరెన్స్ సేల్‌కి రెక్కలొస్తాయి. పెద్ద పండుగ, దీపావళికి ఆఫర్ల ధమాకా వినియోగదారులను ఆవహిస్తోంది. ఏ వ్యాపారీ నష్టానికి వ్యాపారం చేయడనేది జగమెరిగిన సత్యం. పెద్ద ఎత్తున కొని గోదాముల్లో మూలుగుతున్న స్టాకును ఆషాఢంలో క్లియర్ చేసే పనిలో భాగంగా ఆఫర్ల వల విసురుతారు.ఆషాఢం అమ్మకాల్లో మిగిలిన స్టాకునకు కొత్త స్టాకు కలిపి సంక్రాంతి అమ్మకాలకు ఎర వేస్తారు. ఒక చీరకు ఇంకో చీర ఫ్రీ,రెండు కొంటే ఒకటి ఉచితం, రూ.200లకేరెండు..ఇలా రాయితీల్లోఏ మార్గాన్నీ వదిలిపెట్టరు.

ఎంఆర్‌పీ అంటే ఏమిటి?

ప్రతి వస్తువు/సరుకుపై గరిష్ట చిల్లర ధర కచ్చితంగా ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. వాస్తవానికి గరిష్ట చిల్లర ధర(ఎంఆర్‌పీ)కే విని యోగదారులు కొనాలనే నిబంధనేమీ లేదు. ఎంఆర్‌పీపై బేరమాడొచ్చు. కానీ ఎంఆర్‌పీ అని అమ్మేస్తుంటారు.చాలా వస్తువులపై ఎంఆర్‌పీ ధర బాగా ఎక్కువగా వేస్తారు.ఉదాహరణకు ఏదోక కంపెనీ కుక్కర్ ఎంఆర్‌పీ రూ.3500 ఉంటే బేరమాడితే రూ.2500కే వస్తుంది. అప్పటికీ వ్యాపారికి లాభమే.అంటే ఎంఆర్‌పీ ఎంత ఎక్కువగా ముద్రిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.ఎంఆర్‌పీ ధరల ముద్రణపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేక ఎవరికి నచ్చిన ధరలు వారు అచ్చువేస్తూ వినియోగదారులను ఉచ్చులో పడేస్తున్నారు.వస్త్రాల విషయంలో ఒక్కో చీరకు, ఒక్కో చొక్కాకు.. ఇలా ధరలు నిర్ణయించి డిస్కౌంట్ పేరుతో దోచేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పట్టింపులేకుండా వ్యవహరిస్తుండడం వ్యాపారులకుకలిసొస్తుండగా..సామాన్యులు మోసపోతున్నారు.

ఇదీ అసలు మెలిక

తయారీదారుడి దగ్గర నుంచి నేరుగా కొనుగోలు చేస్తే ఓ ధర, రెండు మూడు చేతులు మారితే కొంత ఎక్కువ ధరకు గిట్టుబాటు అవుతుంది. ఒకేసారి పెద్ద మొత్తంలో తయారీ దారుల వద్ద నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేయడంతో తక్కువ ధరకు ఇచ్చే అవకాశం ఉంటుంది. కానీ లాభం మామూలే.ఉదాహరణకు ఓ చీరను తయారీదారుడి వద్ద నుంచి రూ.100కి కొనుగోలు చేస్తే దానిపై రూ.400 ధర వేశారను కుందాం.ఆ చీరపై 50% డిస్కౌంట్ ఇస్తే రూ.200కే మనకు వచ్చిందనుకుంటాం.కానీ ఆ డిస్కౌంటు ధరలోనే 100% లాభం దాగి ఉంటుంది. వినియోగదారులు షాపు లోపలికి వచ్చిన వెంటనే భారీ డిస్కౌంట్లంటూ మభ్యపెట్టే సరుకు కనబడుతుంది. ఒక వేళ వాటి ఆంతర్యం గ్రహించిన వాళ్లు అవి తీసుకోవడానికి ఇష్టపడకపోతే మిగతా వెరైటీ ల్లో ఎక్కువ ధర ఉన్న వాటినైనా కొనుగోలు చేసేస్తారు. కొనుగోలు చేయకుండా సుమారు 90% మంది తిరిగి వెళ్లరు. పైగా ఒకసారి కొన్న తర్వాత డబ్బులు వ్యాపారస్తుల గల్లాపెట్టిలోకి చేరిపోయినట్లే.నాణ్యతలేదని తిరిగి ఇచ్చేయాలనుకుంటే అక్కడే కొనుక్కోవాల్సిందే.డబ్బులు ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగివ్వరు. గృహోపకరణాల దగ్గర నుంచి గుండుసూదుల వరకూ అదే పద్ధతి అవలంబిస్తున్నారు.



కిటకిటలాడుతున్న రాజమహేంద్రవరం మెయిన్ మార్కెట్

లాటరీలతో ఎర

రాష్ట్రంలో లాటరీలు నిషేధం. దీనికి ఓ చట్టమే ఉంది. బహుమతుల పేరుతో జనాలను మోసం చేస్తున్నా అడిగే నాథుడు లేడు. కారు, ఫ్రిడ్జ్.. రానున్న రోజుల్లో రైలు, విమానాన్ని బహుమతులుగా పెట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు. వీటిని ప్రదర్శిస్తూ పలానా రోజున లాటరీ తీస్తాం. ఎవరి పంట పండితే వారికే అవి సొంతం అంటూ ఎర వేస్తున్నారు. ఉదాహరణకు ఓ ఫ్రిడ్జ్ ఖరీదు రూ.15 వేలు అనుకుందాం. 15 రోజుల తర్వాత లాటరీ ఉందనుకుందాం. ఆ 15 రోజుల్లో ఓ 2 వేల మంది సరుకును కొనుగోలు చేస్తే ఒక్కరికి మాత్రమే ఫ్రిడ్జ్ వస్తుంది.ఫ్రిడ్జ్ బాపతు ఒక్కో వస్తువుపై రూ.50 అదనంగా వడ్డించినా.. అక్షరాలా లక్ష రూపాయల రాబడి. దానిలో రూ.15 వేలు పోను రూ.85 వేలు గల్లాపెట్టెలోకే కదా!.

వినియోగదారుడా మేలుకో..

వినియోగదారులు మోసపోకుండా చట్టాలున్నా వాటిని ఉపయోగించుకోవడం పెద్ద ప్రశ్నగా మారింది. కొన్న తర్వాత మోసం బయటపడినా, నాణ్యత లేకున్నా చట్టాలను ఆశ్రయించే పరిస్థితి కానరావడం లేదు. ముఖ్యంగా పండుగ వేళల్లో వినియోగదారులు ఎక్కువగా మోసపోతున్నారు. కానీ ఎవరికి ఫిర్యాదు చేయాలో అధికశాతం మందికి తెలియదు. అంతెందుకు వినియోగదారులు ఫిర్యాదులు /సందేహాల నివృత్తికి ఉన్న టోల్‌ఫ్రీ నంబరు '1915' ఏ దుకాణాల్లోనూ కనిపించదు. వినియోగదారులకు న్యాయపరంగా సహాయం చేయడానికి మండల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు(ఇవి కోర్టుల ప్రాంగణాల్లో ఉంటాయి) సిద్ధంగా ఉన్నాయి.కానీ వాటినీఆశ్రయించరు.ఇవన్నీ వ్యాపారులు మోసం చేయడానికి ఊతమిస్తున్నాయి. అందువల్ల మొదటిగా వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా డిస్కౌంట్లు, రిబేట్లు, ఆఫర్లు అంటూ ఎవరూ నష్టాలకు వ్యాపారాలు చేయరనే సత్యాన్ని గుర్తుంచాలి. మోసం జరిగిందని గ్రహిస్తే న్యాయ పోరాటానికి వెనుకాడకూడదు.

యువకుడి ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

అప్పు తీర్చమని ఇచ్చిన రూ.3 లక్షలు ఆడేసి.. ప్రాణం తీసుకున్నాడు!



రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఓ సారి తప్పు చేశాడు. పెద్దవాళ్లు అప్పుల ఊబినుంచి బయటకు తీసుకొచ్చారు.అయినా మారని బుద్ధి చివరికి ప్రాణాలు తీసి భార్య, పిల్లలను రోడ్డున పడేసింది. శ్రీకాకుళం జిల్లా నిద్దాం గ్రామానికి చెందిన ఎర్నేన లక్ష్మంనాయుడు(31) ఎర్రవరంలోని ఓ ఫ్యాక్టరీలో క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పనిచేస్తూ రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నాడు. మూడేళ్ల కిందట వివాహం కాగా భార్య, కుమార్తె నిద్దాంలో ఉంటున్నారు. ఈ క్రమంలో లక్ష్మంనాయుడు ఆన్‌లైన్‌లో రమ్మీకి బానిసయ్యాడు. సుమారు రూ.6 లక్షలు అప్పులు చేశాడు. విషయం తెలుసుకున్న తండ్రి కాస్త మందలించి రూ.3లక్షలు తీర్చేశాడు. మరో రూ.3లక్షలు మిగతా అప్పులు తీర్చాలని లక్ష్మంనాయుడి ఖాతాలో జమచేశారు. అయితే వాటితో మళ్లీ రమ్మీ మొదలు పెట్టాడు. తిరిగి రూ.6లక్షల అప్పు చేశాడు. ఈ క్రమంలో 6న ఉదయం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వరసకు చిన్నాన్న అయిన పోతు రాజు ఉమామహేశ్వరరావు ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చివరి ఫోన్ టవర్ లోకేషన్ గామన్ బ్రిడ్జి పరిసరాల్లో చూపించింది. దీంతో గోదావరిలో గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం సమయంలో లక్ష్మంనాయుడి మృతదేహాన్ని గుర్తించారు.



కొవ్వూరులో జీవో ప్రతుల దహనం

ఎండాకైనా..పోరాటం!

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 11 : అబల కాదు సబల అనే మాటను అంగన్‌వాడీలు నిరూపించారు. ప్రభుత్వం భయపెట్టినా భయపడలేదు.. నోటీసులు ఇస్తున్నా అదరడం లేదు.. బెదరడం లేదు.. డిమాండ్ల సాధనకు గత 31 రోజులుగా ఆందోళన చేస్తూనే ఉన్నారు. అంగన్వాడీల నిరవధిక సమ్మె గురువారంతో 31వ రోజుకు చేరింది. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన 24 గంటల నిరాహారదీక్షలో రాజానగరం ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. కొవ్వూరులో జీవో నెం 2 ప్రతులను దహనం చేశారు.సమ్మె శిబిరం వద్ద సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి జువ్వల రాంబాబు, ఏపీ అంగన్వాడీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.బేబీరాణి, యూటీఎఫ్ నాయకురాలు అరుణకుమారి తదితరులు మద్దతు తెలిపారు.



పులిహోర గోవిందుడు!

బిక్కవోలు, జనవరి 11 : తూర్పు తిరుమల బలభద్రపురంలో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఏడవ రోజు తిరుప్పావడ అన్నకూటోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో విశేష ఉత్సవం నిర్వహించారు. 40 కిలోల పులిహోర, 10 కిలోల స్వీట్లతో స్వామి వారిని తయారు చేశారు. భక్తులు స్వామిని ఆసక్తిగా తిలకించారు.సాయంత్రం స్వామి, అమ్మవార్లను గజ వాహనంపై వుంచి పురవీధుల్లో ఊరేగించారు.స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధ్యక్షుడు గంగారెడ్డి తెలిపారు.

'మునిసిపల్ కార్మికులను మోసగిస్తే మళ్లీ సమ్మె తప్పదు'

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 11 : మునిసిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదాపడిందని, చర్చలు సానుకూలంగా జరిగినప్పటికీ మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తేనే కార్మికులకు న్యాయం జరిగినట్టు అవుతుందని సంఘ గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరం రెల్లిపేట వద్ద గురువారం రెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మినిట్స్ కాపీ వచ్చిన తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని, వైసీపీ ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తే మళ్లీ సమ్మె తప్పదన్నారు.సమావేశంలో ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, కిషోర్, బంగారు గిరి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

కొప్పవరంలో నూరుశాతం పన్నుల వసూలు

అనపర్తి, జనవరి 11: అనపర్తి మండలం కొప్పవరంలో నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేసి రికార్డు సాధించినట్టు సర్పంచ్ కర్రి బులిమోహన్‌రెడ్డి తెలిపారు. వరుసగా మూడు సంవత్సరాలుగా తక్కువ సమయంలో నూరుశాతం పన్నులు వసూలు చేసినట్టు చెప్పారు. ముందు ఏడాది 18 రోజులు, గత ఏడాది 15 రోజుల్లో నూరు శాతం వసూలు చేయగా ఈ ఏడాది 14 రోజుల్లోనే వంద శాతం పన్నులు రూ.8.92 లక్షలు వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి తాడి వెంకటకృష్ణారెడ్డిని, సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను జిల్లా పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ అభినందించినట్టు సర్పంచ్ తెలిపారు.

అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలి

ఎరువులు షాపుల తనిఖీలో అనపర్తి ఏడీఏ కృష్ణ

నల్లజర్ల, జనవరి 11: రబీ సీజన్లో రైతులు ఎక్కువగా వరి, మొక్కజొన్న పండిస్తారని, వారికి కావలసిన అన్నిరకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ అన్నారు. గురువారం నల్లజర్ల, పోతవరం, అనంతపల్లి గ్రామాల్లోని ఎరువులు, పురుగుమందుల షాపులకు వెళ్లి ఎరువుల నిల్వలు, తూకం, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎక్కువగా వినియోగించే ఎరువులు పురుగుమందులు బ్లాక్ మార్కెట్ చేసి రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్బీకే అధికారులు సూచించిన ఎరువులు, పురుగుమందులనే వినియోగించాలని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల పేరుతో నకిలీ మందులు విక్రయించే ముఠాపై నిఘా ఉంచినట్టు ఏడీఏ చెప్పారు. ఆయన వెంట ఏవో కమల్ రాజ్ ఉన్నారు.

కొవ్వూరులో వీధి కుక్కలు స్వైర విహారం

కొవ్వూరు, జనవరి 11: కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని బీజేపీ నాయకుడు గెల్లా కేశవ విమర్శించారు. గురువారం కొవ్వూరులో రోడ్డుపై నిల్చుని ఉన్న కేశవను వీధి కుక్కలు కరిచాయి. దీంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వ్యాక్సిన్ వేయించుకున్నారు. అప్పటికే ఆసుపత్రికి కుక్క కరిచి వ్యాక్సిన్ వేయించుకోవడానికి మరో నలుగురు వచ్చారన్నారు. చిన్నపిల్లలు, వాహనదారుల వెంటపడి మరి కుక్కలు కరుస్తున్నాయని, రాత్రి సమయాల్లో అత్యవసర పనులపై బయటకు రావాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు ఇకనైనా వీధికుక్కల బారి నుంచి ప్రజలకు కాపాడాలన్నారు.

బస్సులన్నీ కొవ్వూరు డిపోలోకి రావాలి

ఆర్టీసీ అధికారులకు జనసేన ఇన్‌చార్జి రామారావు వినతి



కొవ్వూరులో ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రామారావు

కొవ్వూరు, జనవరి 11: కొవ్వూరు డిపోలోకి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు రాకుండా బైపాస్ మీదుగా వెళ్లిపోతున్నాయని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు అన్నారు. అన్ని బస్సులు డిపోలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే గామన్ వంతెన వద్ద దింపేసిన ప్రయాణికులను పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా టౌన్‌లోకి తీసుకురావాలన్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులకు గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొవ్వూరు డిపోలోకి పల్లెవెలుగు బస్సులు మాత్రమే వస్తున్నాయని, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు రావడం లేదన్నారు. ప్రజా ప్రయోజనార్థం గామన్ వంతెన వద్ద బస్టాండ్‌ను నిర్మించి, అన్నిబస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేగల రాము, కె.నవ్య, సుంకర సత్తిబాబు, గంగుమళ్ల స్వామి, ఏపుగంటి నాగబాబు, కడిమి శ్రీను, మంచిగంటి నరేష్ పాల్గొన్నారు.

కొవ్వూరులో ఎస్ఈబీ దాడులు

కొవ్వూరు, జనవరి 11: కొవ్వూరులో గురువారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించి 16వ వార్డు ఔరంగాబాద్‌కు చెందిన కాసాని మణికంఠను అరెస్టుచేసి అతని వద్ద 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ వి.సత్యనారాయణ తెలిపారు.

దేవరపల్లి: నల్లజర్ల మండలం అనంతపల్లిలో గురువారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వెలగన నాగేశ్వరరావును అరెస్టు చేసి అక్రమంగా తరలిస్తున్న 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

విధుల్లోకి మునిసిపల్ కార్మికులు

నిడదవోలు, జనవరి 11: మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు విధుల్లో చేరారు. ఏఐటీయూసీ పోరాటం ద్వారా కార్మికులకు వేతనాలు పెరిగాయని, సెక్రటేరియెట్‌లో కార్మిక సంఘాల జేఏసీ నేతలతో మంత్రులు, అధికారులు జరిపిన చర్చలు సఫలీకృతమయ్యామని ఏఐటీయూసీ నాయకుడు రేఖా భాస్కరరావు అన్నారు. గురువారం నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వేతనాలపాటు 12వ పీఆర్సీలో ఫిట్‌మెంటు పెరుగుతుందని, హెల్త్‌కార్డుల జారీకి ఒప్పందం కుదిరిందన్నారు. కార్యక్రమంలో కాకి అప్పలరాజు, బొచ్చా ముద్దు కృష్ణ, బండారు రాంబాబు, కారింకి వెంకటేష్, బంగారు జగ్గమ్మ, కాకి లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

నరేంద్రకు సాహిత్య అకాడమీ పురస్కారం




పురస్కారం అందుకొంటున్న నరేంద్ర

నిడదవోలు, జనవరి 11: నిడదవోలు మండలం గోపవరం గ్రామానికి చెందిన ఆరవల్లి నరేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. నరేంద్ర సాహిత్య రంగంలోనూ, ఆదరణాలయం ఛారిటీస్ ద్వారా చేస్తున్న సేవలను గుర్తించి ఏలూరులోని వైఎంసీఏ ఆడిటోరియమ్‌లో రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, కత్తిమండ ప్రతాప్, డాక్టర్ హైమావతి భీమన్న గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణ మండల ప్రముఖులు, సాహిత్య అభిమానులు అభినందించారు.

పల్లంట్లలో అయోధ్య రాముడి అక్షింతలు వితరణ

దేవరపల్లి, జనవరి 11: మండలంలోని పల్లంట్లలో అయోధ్యరాముని అక్షింతలు రామమందిర చిత్రపటం, ఆహ్వానపత్రిక ప్రతిని ఇంటింటికీ అందజేశారు. మేళతాళాలు, కోలాట భజనలతో వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దొర్బల ప్రభాకర్‌శర్మ, రామదాసి మాతాజీ, కేంద్ర రైల్వేబోర్డు అడ్వైజర్ కమిటీ సభ్యుడు బొల్లిన నిర్మలకిషోర్, బలుసు సత్యనారాయణ, గ్రామస్థులు వితరణ చేశారు.

వైసీపీ నాయకుడు చిన్నారి మృతి



కొవ్వూరు, జనవరి 11: వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు గురుజు బాల మురళీకృష్ణ (చిన్నారి)(55) అనారోగ్యంతో మృతి చెందారు. మద్దూరు గ్రామానికి చెందిన ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందారు. చిన్నారి మద్దూరు సొసైటీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆయన మృతి పట్ల హోంమంత్రి తానేటి వనిత, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, బండి పట్టాభిరామారావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ముదునూరి నాగరాజు సంతాపం తెలిపారు.

దళితులే జగన్‌ను గద్దెదించబోతున్నారు..

8న రాజమహేంద్రవరంలో సింహగర్జన సభ

అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11: అధికారాన్ని ఇచ్చిన దళితులే ముఖ్యమంత్రి జగన్‌ను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి గద్దె దించబోతున్నారని అమలాపురం మాజీ ఎంపి జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చాక దళితుల జీవితాలు బాగుపడతాయని ఆశించిన వారి ఆశలపై నీళ్ల చల్లాడన్నారు. దళితులపై దాడులు,దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు వంటివి అధికమై దళితులంతా వంచించబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత యువకులను కొట్టిచంపితే రూ.10 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోవడం, అత్యాచారం చేసి చంపితే నిందితులను అరెస్టులు చేయకుండా అడ్డుపడడం , ఇద్దరు దళిత యువకులకు శిరోముండనం చేస్తే చర్యలు తీసుకోకపోవడం, డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా ఇబ్బందులకు గురిచేసి అతను చనిపోవడానికి కారణం కావడం ఇలా అనేక సంఘటనలు ఉన్నాయన్నారు. అందుకే దళితులంతా ఏ ఓటుతో జగన్‌ను సీఎం చేశారో అదే ఓటు తో కిందకు దించబోతున్నారని చెప్పారు. వచ్చే నెల 8న రాజమహేంద్రవరం బొమ్మూరులో దళిత సింహగర్జన నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభ ద్వారా దళితుల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. తాను అమలాపురం నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నానని చెప్పారు. సమావేశంలో జీవీ శ్రీరాజ్, యర్రా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులైనా..ఆగని పోరాటం..



జగన్‌ను మార్చు : నల్లజర్లలో దేవుడికి మొక్కుతున్న అంగన్వాడీలు

» 31వ రోజు కొనసాగిన సమ్మె

» అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నిరసన

కొవ్వూరు, జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట 31వ రోజు అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. అంగన్వాడీలకు శాఖా పరంగా అందించిన షోకాజ్ నోటీసులను తగలబెట్టి నిరసన తెలియజేశారు. నెల రోజలుగా అంగన్వాడీలు రోడ్డెక్కి సమ్మెచేస్తున్న ప్రభుత్వం స్పందించకుండా షోకాజ్ నోటీసులు జారీ చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సీహెచ్ పుష్పావతి, సుబ్బలక్ష్మి, ఎ.నరసమాంబ, బి.పద్మజ, బి.వసంత, డి.అమరావతి, సీహెచ్ బ్రహ్మమ్మ, పీవో డబ్ల్యు నాయకులు ఈమని మల్లిక, ఎం.మంగతాయారు పాల్గొన్నారు.

చాగల్లు: వైసీపీ ప్రభుత్వంను సాగనంపడానికి ప్రజలు సిద్ధమైపోయారని, అన్నివర్గాల ప్రజలు ఈ ప్రభుత్వ బాధితులేనని మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న అంగన్‌వాడీల వద్దకు టీడీపీ, జనసేన నాయకులు విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టీవీ రామారావు మాట్లాడుతూ మూడు నెలలు తర్వాత టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తుందని, అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేరుస్తుందన్నారు. ఉద్యోగులు, రైతులు, కార్మికులు సహా సామాన్య ప్రజలు ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కేతా సాహెబ్, తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, ఈదుపుగంటి మురళి, దొంగ రామకృష్ణ, ఆళ్ల సూర్యప్రకాశరావు, నవ్య పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను దహనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఎస్మా వద్దు జీతాలు పెంచండంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు రాంబాబు, అంగన్‌వాడీలు యు.ధనలక్ష్మి, ఎన్.వెంకాయమ్మ, జి.మమత, జె.రత్నకుమారి, ఎ.పార్వతి, కె.పద్మావతి, సరళ, కుమారి, సుజాత తదితర్లు పాల్గొన్నారు.

పెరవలి: ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ ఇచ్చిన నోటీసుల ప్రతులను అంగన్‌వాడీ కార్యకర్తలు మంటల్లో వేసి తగులబెట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్మా చట్టం అమలును నిలిపివేయాలని, తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.కృష్ణవేణి, డి.నాగవేణి, సీహెచ్ విశాలి, నిర్మల, కన్యాకుమారి పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నేలపై మోకరించి ఇచ్చిన హామీలు అడిగితే ఉక్కుపాదం మోపుతున్న సీఎం జగన్‌కు మంచి బుద్ధి కలిగించు దేవుడా అంటూ వేడుకున్నారు. రామాలక్ష్మి, శివకుమారి, కనకదుర్గ, లక్ష్మి పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో అంగన్వాడీలు మెడకు ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, అంగన్వాడీ సంఘం నాయకురాలు టీపీ లక్ష్మి మాట్లాడుతూ 31రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని విమర్శించారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోగా షోకజ్ నోటీసులు, విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేయడం దారుణమన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ముఖ్యమంత్రి మాటతప్పి మడమతిప్పారని విమర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రత్నాజీ, పద్మకామేశ్వరి, నర్సమ్మ, కొమ్మిరెడ్డి కుమారి, ఇందిరా పాల్గొన్నారు.



చాగల్లులో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు



దేవరపల్లిలో మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

భవిష్యత్తుకు తెలుగుదేశం-జనసేన గ్యారెంటీ

» మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న శేషారావు

నిడదవోలు, జనవరి 11: యువత భవిష్యత్‌కు తెలుగుదేశం, జనసేన గ్యారెంటీ ఇస్తాయని రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనేది ప్రజల ఆకాంక్ష అని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. గురువారం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టాక కొత్త ప్రాజెక్టులు రావడం లేదని, ఉన్న ప్రాజెక్టులు పూర్తికావడం లేదని, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఒక్క డీఎస్సీ నోటిఫికే షన్ కూడా ఇవ్వలేదన్నారు. సైకిల్ పాలన కోసం ప్రజలంతా ఎదురు చూస్తూ రా కదలిరా బహిరంగ సభలను విజయవంతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, కారింకి నాగేశ్వరరావు, డి.రామారావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీలు టీడీపీకి వెన్నెముక: మద్దిపాటి

గోపాలపురం జనవరి 11: బీసీలంటే వెనుకబడిన వారు కాదని తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా నిలిచే వెన్నుముక లాంటి వారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మండలంలోని వాదాలగుంట గ్రామంలో మండల ప్రధాన కార్యదర్శి వడ్డమూడి రమేష్ నివాసం వద్ద మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42ఏళ్లగా టీడీపీకి బీసీలు వెన్నుదన్నుగా నిలిచారని, ఎన్టీఆర్ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి 27శాతం రిజర్వేషన్లు కల్పిస్తే చంద్రబాబు దానిని 33శాతానికి పెంచారన్నారు. టీడీపీకి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు అభిప్రాయ భేదాలను పక్కన పెట్టి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మీరా, రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్ది పద్మావతి, చెల్లుబోయిన శ్రీనివాస్, కుమార్, కాకర్ల రామతులసి, నున్న వెంకటమోహనరావు, కాకర్ల శ్రీరామ్, ఈలి శరత్‌బాబు, జాస్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వాదాలగుంటలో సమావేశంలో బీసీల ఐక్యతను చాటుతున్న నాయకులు

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

» కొవ్వూరు తహశీల్దార్ నాగరాజ నాయక్



కొవ్వూరు: నందమూరులో మాట్లాడుతున్న తహశీల్దార్ నాగరాజనాయక్

కొవ్వూరు, జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ బి.నాగ రాజ నాయక్ హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని పశివేదల, నందమూరు గ్రామాల్లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కోడి పందేలు, గుండాట, పేకాట నిషేధమని, పండుగ ముసుగులో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 9 నుంచి 25వ తేదీ వరకు సీఆర్‌సీసీ 144 అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు రూరల్ ఎస్ఐ జి.సతీష్, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్ఐ కె.వెంకటరమణ, ఎంపీడీవో టీవీబీ రమణ మాట్లాడుతూ ప్రజలు పండుగ ముసుగులో కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పందేలకు అనుమతులు లేవని, గ్రామాల్లో పంచాయతీల వద్ద సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పెరవలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ రాజరాజేశ్వరి మాట్లాడారు. మండలంలో కోడిపందాలు నిర్వహించరాదని, ఏ గ్రామంలోనైనా చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో గతంలో కోడిపందాలు, ఇతర జూద కార్యక్రమాలతో సంబంధం ఉన్నవారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించాలని, ప్రభుత్వ సిబ్బంది జాగ్రత్తగా ఉండి ఎప్పటికపుడు సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆర్థిక సాయం

బిక్కవోలు, జనవరి 11: తమ డిమాండ్ల సాధనకై బిక్కవోలులో నిరవధిక సమ్మె చేస్తున్న మండల ఎస్ఎస్ఏ సిబ్బందికి మండల యూటీఎఫ్ నేతలు గురువారం రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించి సమ్మెకు మద్దతు తెలిపారు. అనంతరం 31 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ సిబ్బందికి ఆర్థిక సాయం అందించి సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామచంద్రారెడ్డి, గోవిందరావు, డీవీవీ, నాగేంద్రప్రసాద్, సతీష్‌రెడ్డి, సీతారాం, ఏడుకొండలు, శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కార్మిక చైతన్య బస్సుయాత్ర

టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ధర్మారాజు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 11: టెక్కలిలో ఈ నెల 6న ప్రారంభమై కుప్పం వరకు సాగుతున్న కార్మిక చైతన్య బస్సుయాత్రను విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్య క్షుడు యర్ర మోతు ధర్మరాజు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. టీఎన్‌టీయూసీ బస్సు యాత్ర ఈనెల 12న రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోకి ప్రవేశిస్తుందని కడియపులంక వద్ద బస్సుకు స్వాగతం పలుకుతామని చెప్పారు. శుభమస్తు ఫంక్షన్ హాలులో 13న ఉదయం 9 గంటలకు మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నామని ఇందులో రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, బాధ్యులు, టీడీపీ జనసేన నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తీడ ఆదిబాబు, అధికార ప్రతినిధులు దాసరి శ్రీనివాస్, పాతూరి గిరిధర్, ఉపాధ్యక్షుడు ఎర్రంశెట్టి రాజకుమార్, రూరల్ ఉపాధ్యక్షుడు నీలి కిషోర్ , మండల అధ్యక్షుడు గజ్జరపు ప్రసాద్, శీలం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డు తీసుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి



రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ్ కార్డు కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ)కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. సీటీఆర్ఐ సమీపంలోని విశ్వకర్మ వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. నల్సావారి అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ సేవల పథకం-2015 ద్వారా డీఎల్ఎస్ఏ అమలు చేస్తున్న సేవలపై వివరించారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు పొందలేకపోతే డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు షేక్ జబీన, టీఎస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి ఒడికి చిన్నారి

నెలన్నరలో కేసు ఛేదించిన జీఆర్పీ



చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న సీఐ విజయ్ శంకర్

రాజమహేంద్రవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రైల్వే పోలీసుల (జీఆర్పీ) ప్రత్యేక చొరవతో తల్లి నుంచి దూరమైన చిన్నారి నెలన్నరలో తిరిగి ఆమె ఒడికి చేరింది. జీఆర్పీ సీఐ విజయ్‌శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతేడాది నవంబరు 18న రాజమండ్రి రైల్వే స్టేషనులోని ఏడాదిన్నర పసిపాప ఒంటరిగా ఏడుస్తోందంటూ డ్యూటీలో ఉన్న ఆర్పీహెచ్‌సీ ఎస్‌వీవీ సత్యనారాయణకు చెప్పారు. ఆయన ఏఆర్ఎస్ఐ ఎస్.సత్యనారాయణతో హుటాహుటిన వెళ్లి పాపను సంరక్షించి వివరాల కోసం వాకబు చేయగా ఫలితం లేకపోయింది. దీంతో కేసు నమోదు చేసి.. చైల్డ్ వెల్ఫేర్ వాళ్లకు సమాచారమివ్వగా వాళ్లు పాపను తీసుకెళ్లారు. సీఐ విజయ్‌శంకర్ పర్యవేక్షణలో ఆర్పీఎస్ఐ పి.లోవరాజు, ఆర్పీ ఎస్ఐ కె.మావుళ్లు కేసు దర్యాప్తు చేపట్టారు. మీడియా, సోషల్ ద్వారా విస్తృత ప్రచారాన్ని కల్పించారు. ఇన్‌స్టాగ్రాంలో చూసిన పాప బంధువు ఒకరు కాట్రేనికోన మండలం కొత్తపాలెంకి చెందిన పాప తల్లి ఓలేటి కావేరికి విషయాన్ని చేరవేశారు. దీంతో ఆమె జీఆర్పీ పోలీసులను గురువారం ఆశ్రయించగా పాపను అప్పగించారు. ఆ రోజున తల్లి ఇంటికి బయలుదేరి పాప తినడానికి ఏదైనా తీసుకురావడానికి స్టేషను బయటకు వెళ్లగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆమె కళ్లు తిరిగి పడిపోయిందని.. తర్వాత వచ్చి చూడగా పాప కనబడకపోవడంతో అప్పటి నుంచీ వాళ్లు వెతుకుతున్నా రని సీఐ చెప్పారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ విజయ్ శంకర్, ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు ఇతర సిబ్బందికి రైల్వే పోలీసు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, రైల్వే డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు ప్రశంసించారు.

హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా షర్మిళారెడ్డి



రాజమహేంద్రవరం, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ హౌసింగ్ బోర్డు చైర్‌పర్సన్‌గా రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి నియమితులయ్యారు. ఇటీవల రుడా చైర్‌పర్సన్‌గా ఆమెను కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన రెండో రోజునే వాటిని రద్దు చేసిన సం గతి తెలిసిందే. అప్పట్లో ఎంపీ మార్గాని భరత్‌రామ్ పట్టుపట్టి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుకు రుడా పదవి వచ్చేటట్టు ప్రయత్నించారు. ఇవాళ అనూహ్యంగా ఆమెకు హౌ సింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది.ఉత్తర్వులు స్వయంగా తీసుకుని షర్మిళారెడ్డి, ఆమె భర్త అనిల్‌రెడ్డి బయలుదేరినట్టు చెప్పారు. దీంతో రాజమహేంద్రవరం రాజకీయం రసవత్తరంగా మారింది.

పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ

బిక్కవోలు, జనవరి 11: ఊలపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం జడ్పీటీసీ రొంగల పద్మావతి జిల్లా పరిషత్ వారు ముద్రించిన టెన్త్ క్లాస్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోతుల ప్రసాదరెడ్డి, పెంకే గోవిందు, రొంగల అప్పాజీ, హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరామారెడ్డి, కన్నారావు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా నన్నయ వర్సిటీ జట్టు ఎంపిక



సెపక్‌తక్రా పోటీలను ప్రారంభిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 11: జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరచి విజయం సాధించాలని వీసీ కె.పద్మరాజు కోరారు. విశ్వవిద్యాలయ సెపక్‌తక్రా పురుషుల జట్టు ఎంపికలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నన్నయ వర్సిటీ గోదావరి జిల్లాల్లో నైపుణ్యం గల క్రీడాకారులకు చక్కని వేదికగా మారిందన్నారు. సెపక్‌తక్రా ఎంపిక పోటీలు నిర్వహించి టి.షణ్ముఖ్‌శ్రీవంశీ, కె.పవన్‌కుమార్, సీహెచ్ మోహనకృష్ణ, టి.బాలయేసు, జె.బాలనాగేశ్వరరావు, ఎం.దుర్గాచందు, కె.వెంకటసత్యసూర్యలను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, వి.సల్మాన్‌దేవానంద్, సీహెచ్.సుబ్రహ్మణ్యం, టి.యోగశ్రీ, క్రీడాబోర్డు కార్యదర్శి బి..రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

రాజానగరం, జనవరి 11: మండలంలో నరేంద్రపురంలోని గుత్తుల కృష్ణవేణిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూజిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణవేణి ఒంటరి మహిళ అని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోందని, ఈ నెల 3వ తేదీ రాత్రి గ్రామానికి చెందిన పెంకే దుర్గారావు, అతని కుటుంబీకులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని రాజమహేంద్రవం ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. అయితే బాధ్యులపై ఇప్పటివరకు ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ తహశీల్దార్ పవన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు భీమశంకర్ బాధితుల తరపున ఆందోళన చేసిన వారిలో ఉన్నారు.

కథా రచనలో గైట్ ఫార్మసీ విద్యార్థిని ప్రతిభ



రాజానగరం, జనవరి 11: యువజన సేవల కమీషనర్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్.ఆర్యకు తృతీయ బహుమతి లభించినట్టు గైట్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు ఫోక్ డ్యాన్స్, ఫొటోగ్రఫీ, ఫోక్ సాంగ్, పోస్టర్ మేకింగ్, స్టోరీ రైటింగ్(కథారచన) తదితర అంశాలపై పోటీలు నిర్వహించారన్నారు. దీనిలో స్టోరీ రైటింగ్‌లో హర్ష్య తృతీయ స్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ ధనరాజు, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా అభినందించారు.

వీఆర్ఏ ప్రసాద్ మృతికి సంతాపం

గోకవరం, జనవరి 11: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తూ, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొల్లాటి ప్రసాద్ పట్ల పలువురు సహచర ఉద్యోగులు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు. అలాగే గోకవరం, బిక్కవోలు తహశీల్దార్లు శ్రీనివాసరావు, కంగుల పోసిబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అంత్యక్రియలు నిమిత్తం తహశీల్దార్ శ్రీనివాసరావు ప్రభుత్వం తరపున రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సమ్మెట మోహన్, సర్పంచ్ రామలక్ష్మి, పెనికేటి అచ్చిరాజు, పలు గ్రామాల వీఆర్వోలు, సిబ్బంది పాల్గొని ప్రగాఢ సంతాపం తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	గుంటూరుకారం
వై.స్క్రీన్ 2	గుంటూరు కారం
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	గుంటూరు కారం
శ్రీగణపతి	హాయ్ నాన్న
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్